ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

కోనసీమ జిల్లా వార్తలు

గురువారం 12 జూన్ 2025 | 3

అమలాపురం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 33(బుధవారం)

కనిష్ఠం : 27

వాసాలతిప్ప తీరానికి చేరిన గల్లంతైన యువకుడి మృతదేహం 5

రామచంద్రపురంలో రైతుబజార్ ప్రారంభం



రామచంద్రపురంలో రూ.80 లక్షలతో నిర్మించిన రైతుబజార్‌ను మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించారు. అనంతరం ఆయన ఇలా కూరగాయలు కొనుగోలు చేశారు.

ఏరువాక సాగారో అన్నో..!



ఐ.పోలవరం మండలం పాతయింజరంలో నాగలికి పూజ చేస్తున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా బుధవారం ఏరువాక పౌర్ణమి నిర్వహించారు. నాగలికి పూజ చేసి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఐ.పోలవరం మండలం పాతయింజరంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు నాగలితో దుక్కి దున్నారు. ఉప్పలగుప్తం మండలం సింగరాయపాలెంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు నాగలికి పూజలు చేసి పొలం దున్ని విత్తనాలు చల్లారు. అంబాజీపేట మండలం మాచవరం పరిధి పోతాయిలంకలో ఏరువాక పౌర్ణమిలో జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు పాల్గొన్నారు.

అంతర్వేది పుణ్యక్షేత్రంలో.. వైభవంగా మహా జ్యేష్ఠాభిషేకం 5



మహా జ్యేష్ఠాభిషేకం సందర్భంగా పూర్ణాహుతి వద్ద ఎమ్మెల్యే దేవవరప్రసాద్



నేటినుంచి విద్యాసంస్థలు పునఃప్రారంభం

- విద్యార్థులకు పుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు
- నేడు తల్లికి వందనం పథకం ప్రారంభం



అమలాపురం మండలం బండారులంకలో పంపిణీకి సిద్ధం చేసిన పుస్తకాలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

2025-26 నూతన విద్యా సంవత్సరంలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గురువారం నుంచి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. జిల్లావ్యాప్తంగా స్కూళ్లు తెరిచే రోజునే విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ముమ్మిడివరంలోని గురుకుల పాఠశాలను బుధవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా పరిధిలోని అమలాపురం, రామచంద్రపురం, మండపేట పట్టణాలతోపాటు ముమ్మిడివరం నగర పంచాయతీ సహా 22 మండలాల పరిధిలో ఉన్న 1567 విద్యాసంస్థలు పునఃప్రారంభం కానున్నాయి. వీటిలో 91వేలమంది 1 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు విద్యాబోధన చేయనున్నారు. పాఠశాల పునఃప్రారంభం నేపథ్యంలో జిల్లాలోని అన్ని పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. పాఠశాలలు తెరిచే రోజునే ప్రభుత్వం విద్యార్థులకు తల్లికి వందనం పథకం ప్రారంభించనుంది. దీనిలోభాగంగా ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.15వేల చొప్పున సీఎం చంద్రబాబు నిధులు విడుదల చేయనున్నారు. జిల్లాలో ఉన్న 91వేలమంది విద్యార్థులకు 4,05,812 పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. 77,697 వర్క్ పుస్తకాలు, 6.28లక్షల నోటు పుస్తకాలు, 7936 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, 6112 పిక్టోరియల్ డిక్షనరీలు పంపిణీ చేయనున్నారు. విద్యార్థులకు అందజేసే కిట్లలో 90,981 బ్యాగులు, 6390 బెల్టులతోపాటు ఏకరూప దుస్తులు, బూట్లు, టైలు, ఇతర సామాగ్రిని త్వరలోనే విద్యార్థులకు అందజేసేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభంతో విద్యార్థులు సెలవులు ముగించి హాజరుకానున్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సన్నబియ్యం సరఫరా

- తొలివిడతగా 9,694 బియ్యం బ్యాగ్‌ల పంపిణీ

అమలాపురం టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో సన్నబియ్యం సరఫరా చేసేందుకు నిర్ణయించినట్టు జిల్లా పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎం.బాలసరస్వతి తెలిపారు. దీనిలో భాగంగా రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసిన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంక్షేమ వసతిగృహాలకు అందజేస్తామన్నారు. జిల్లాలో 1534 ప్రభుత్వ పాఠశాలలతోపాటు 62 సంక్షేమ వసతిగృహాల్లో గురువారం నుంచి తిరిగి అమలు కానున్న మధ్యాహ్న భోజన పథకం కోసం సన్నబియ్యాన్ని ఇప్పటికే సరఫరా చేశామన్నారు. గుంటూరులో రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఆ సన్నబియ్యాన్ని తునిలో ప్యాకింగ్ చేసి ఎక్కడా అవకతవకలకు తావులేకుండా క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే జిల్లాలోని పాఠశాలలు, వసతిగృహాలకు 9694 ప్యాకెట్లు(25కిలోలు) సన్నబియ్యాన్ని సరఫరా చేశామని తెలిపారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందించడమే లక్ష్యమన్నారు.

సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెంలో పైపులైను నుంచి గ్యాస్ లీక్ 5

ఏడాది.. ఏమైంది..



అమలాపురం - ఆంధ్రజ్యోతి

కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది

నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టిన జిల్లా ఎమ్మెల్యేలు

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఎంపీ హరీష్ కృషి

ఏడాది పాలనలో సాధించిన ప్రగతి.. ఆశాజనకంగానే..

ప్రధాన హామీలు అమలు దిశగా ఎమ్మెల్యేల ప్రయత్నాలు

పార్టీ శ్రేణులు, ప్రజల కోసం ప్రత్యేక గ్రీవెన్స్‌లు వినూత్నం



ఆత్రేయపురం మండలం పిచ్చుకలంకలో పర్యాటక ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే సత్యానందరావు, కలెక్టర్ మహేష్‌కుమార్‌తోపాటు ఓబరాయ్ గ్రూప్ సంస్థల ప్రతినిధులు (ఫైల్)

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో బీజేపీ మద్దతుతో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి గురువారంతో ఏడాది పాలన పూర్తి చేసుకుంది. నాటి సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించి అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు సాగిన పాలన తీరును ప్రజలు నిశితంగానే పరిశీలిస్తున్నారు. వైసీపీ పాలనకు, కూటమి పాలనకు మధ్య స్పష్టమైన మార్పులనూ గమనిస్తున్నారు. ఈ ఏడాదిలో ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరును సైతం జనం బేరీజు వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు, ఎంపీ ఏం చేశారు, ఇచ్చిన హామీలు నిలబెట్టుకునే పనిలో ఉన్నారా, వాటిని ఎంతవరకు సాధించారు, ఇంకా వీడని సమస్యలేంటి వంటి అనేక విషయాలను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించింది. అందులో ప్రధానమైన విషయాలను తెలిపే కథనమిది...

వాసంశెట్టి సుభాష్, టీడీపీ ఎమ్మెల్యే, రామచంద్రపురం, కార్మికశాఖ మంత్రి



ఏం చేశారు...

- గొల్లపాలెం-కుయ్యేరు మధ్య రూ.36 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టారు.
-నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రామచంద్రపురంలో నియోజవర్గ స్థాయి ఉపాధి కార్యాలయాన్ని నెలకొల్పి ప్రతీ సోమవారం నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరిస్తున్నారు. జాబ్‌మేళాలు, ఎంఎస్‌ఎంఈ ద్వారా ప్రత్యేక అవగాహన సదస్సులు, మహిళలకు బ్యూటీషియన్, కుట్టు శిక్షణ కోర్సులు నేర్పిస్తున్నారు. ఇప్పటివరకు పలు జాబ్‌మేళాల ద్వారా 1500 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు.
-రూ.80 లక్షల అంచనా వ్యయంతో రైతుబజార్‌ను నిర్మించి ప్రజలకు అంకితం ఇచ్చారు.
-కోట్లాది రూపాయల వ్యయంతో గ్రామాల్లో సీసీ రోడ్లు, వంతెనల నిర్మాణాలు చేపట్టారు.
-రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి వీలుగా అనేక ప్రణాళికలను అమలుచేస్తున్నారు.
-కోటిపల్లి-ముక్తేశ్వరం మధ్య భారీ వంతెన నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు.
-ఇంటింటికీ కుళాయి ద్వారా మంచినీటిని అందించి ప్రజల ఆరోగ్యానికి సహకరిస్తున్నారు.

ప్రధాన సమస్యలు..

నియోజకవర్గంలో ప్రజల పాలిట శాపంగా మారిన అనధికారిక పశుకబేళా సమస్య పరిష్కరించాల్సి ఉంది. న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా కబేళాల సమస్యను పరిష్కరించడానికి మంత్రి సుభాష్ చర్యలు చేపట్టారు. గౌతమీ నదిపై కోటిపల్లి-ముక్తేశ్వరం వంతెన సమస్య ఉంది. ఇక్కడ భారీ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమై సీఎం చంద్రబాబు పరిశీలనలో ఉంది.

కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణంపై దృష్టి

గంటి హరీష్‌మాధుర్, టీడీపీ ఎంపీ



- లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కోట్ల రూపాయల వ్యయంతో సీసీ రోడ్లు, వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. వాటితో చేపట్టిన పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.
- పాశర్లపూడి నుంచి కడలి వరకు 216 బైపాస్ రహదారి అభివృద్ధి పనులను వేగవంతానికి ఎంపీ హరీష్ కీలక పాత్ర వహించారు.
-నియోజకవర్గాల్లో జాబ్‌మేళాల ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణంపై దృష్టి పెట్టారు.
- చమురు సంస్థలు మంజూరుచేసే సీఎస్సార్ నిధులతో వివిధ నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సిఫార్సులు చేశారు.
- పేరూరు వై.జంక్షన్ నుంచి అమలాపురం రూరల్ గ్రామాల మీదుగా రావులపాలెం మండలం వెదిరేశ్వరం వెళ్లే 216ఏ రహదారి అభివృద్ధి డీపీఆర్ రూపకల్పనలో కీలక పాత్ర వహిస్తున్నారు.

వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ ఎమ్మెల్యే, మండపేట, ప్రజా అంచనాల కమిటీ చైర్మన్



-నియోజకవర్గస్థాయిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం కొనసాగుతున్నాయి.
- మండపేట పట్టణాన్ని సర్వాంగ సుందరంగా చేసేందుకు అనేక ప్రణాళికలను దశల వారీగా అమలుచేస్తున్నారు.
- రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో ఉన్న అనేక కీలక సమస్యలను పరిష్కరించడానికి కోట్లాది రూపాయల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నారు.
- కేశవరం, జడ్.మేడపాడుల వద్ద రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి అంచనాలు సిద్ధమై టెండర్ల దశలో ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.
-ఇంటింటికీ కుళాయి పథకం ద్వారా తాగునీటి సమస్యను ప్రధానంగా తీసుకుని పరిష్కరిస్తున్నారు.

ప్రధాన సమస్యలపై..

- ఎన్నికల సమయంలో తాను నెగ్గిన మూడు నెలల కాలంలోనే మండపేటలో నిర్మించిన టిడ్కో గృహాలను అన్ని సౌకర్యాలతో లబ్ధిదారులకు అందజేస్తామన్న హామీ ఏడాదైనా ఇంకా అమలులోకి రాలేదు.
- మొత్తం 6400 గృహాలకుగాను ఫేజ్-2లో నిర్మించిన 2200 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందిస్తామన్న హామీ అమలు కోసం నియోజకవర్గ ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ హామీ అమలుపై ప్రతిపక్ష పార్టీలు కూడా ఒత్తిడి పెంచుతున్నాయి.

బండారు సత్యానందరావు, టీడీపీ ఎమ్మెల్యే, కొత్తపేట



- నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో సుమారు రూ.వంద కోట్ల అంచనా వ్యయంతో రహదారుల నిర్మాణం కొన్ని పూర్తికాగా, మరికొన్ని వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి.
- సెంట్రల్ డెల్టాలో అత్యంత కీలకమైన లొల్ల లాకుల ఆధునికీకరణ ప్రక్రియకు భారీ వ్యయ ప్రణాళికతో ప్రతిపాదనలు సిద్ధంచేసి ఇరిగేషన్ మంత్రి ద్వారా ఆ పనులకు శ్రీకారం చుట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.
- వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి విస్తరణ పనులు కోట్ల రూపాయల వ్యయంతో కొనసాగుతున్నాయి.
- కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారిపై జొన్నాడ వద్ద ఫ్లైఓవర్ వారధి నిర్మాణానికి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.
- వానపల్లిలో శ్రీపళ్లాలమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చెసేందుకు రూ.11 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి అధికారులకు పంపించారు.
- వారానికోసారి ప్రత్యేక గ్రీవెన్స్ ద్వారా సమస్యలను పరిష్కరిస్తున్నారు.

కల.. నెరవేరేలా..

కోనసీమ పరిధిలో కాటన్ బ్యారేజీ సమీపంలో పిచ్చుకలంకలో పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలకు చంద్రబాబు ప్రభుత్వంలో మళ్లీ అడుగులు ముందుకు పడుతున్నాయి. ఓబరాయ్ గ్రూప్ ప్రతినిధులతో కలిసి పిచ్చుకలంకను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రంగం సిద్ధమైంది. ఏళ్లతరబడి ఎన్నికల హామీగానే ఉన్న ఈ ప్రాజెక్టు కల సాకారం అవుతుండడం విశేషం.

అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ ఎమ్మెల్యే, అమలాపురం



- నియోజకవర్గ స్థాయిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు భారీ వ్యయ ప్రణాళికలతో అమలవుతున్నాయి.
- ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే కొన్ని నిర్మాణాలను పూర్తిచేశారు. రహదారులను నిర్మించారు. పర్యాటక కట్టడాలు నిర్మితమవుతున్నాయి.
-ఎస్.యానాం బీచ్‌లో భారీ స్టేడియం నిర్మాణానికి రంగం సిద్ధమైంది.
-అమలాపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్య నివారణకు ప్రధాన కెనాల్‌పై రూ.4 కోట్ల అంచనా వ్యయంతో రెండు వంతెనల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి.
-అమలాపురంలో రైతును బజార్‌ను, అన్న క్యాంటీన్‌ను పునరుద్ధరించారు.
-వారానికోసారి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులతో సమన్వయం చేసుకుంటూ ముందుకుసాగుతున్నారు.

ప్రధాన సమస్యలపై..

- జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణ పరిసరాల్లో ఏడు ప్రదేశాల్లో వంతెనలు నిర్మించి రహదారులను అభివృద్ధి చేసే ట్రాఫిక్ సమస్య నివారణతోపాటు ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయనే ఆలోచనలో ఉన్నారు. ఎన్నికల్లో ఈ మేరకు హామీ ఇచ్చారు. అమలాపురం-బొబ్బర్లంక కెనాల్‌పై రెండు వంతెనలను ప్రారంభించి మరికొన్ని రోజుల్లో పూర్తి చేసేందుకు తొలి దశ ప్రయత్నాలు తుది దశకు చేరాయి. జిల్లా కేంద్రంగా ఉన్న పట్టణాన్ని సర్వాంగ సుందరంగా చేయాలనే ఆలోచనతో ఉన్నారు.

దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) టీడీపీ ఎమ్మెల్యే, ముమ్మిడివరం



- నియోకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో కోట్ల రూపాయల అంచనా వ్యయంతో రహదారుల విస్తరణ, గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు.
- తీరప్రాంత మత్స్యకార గ్రామాల్లో రూ.76.90 కోట్ల అంచనా వ్యయంతో వారధుల విస్తరణ, నిర్మాణానికి ప్రతిపాదనలు అమలు దశలో ఉన్నాయి.
- రూ.30.39 కోట్ల అంచనా వ్యయంతో 196 రోడ్లు, కల్వర్టులు, ఇతర నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి.
-రూ.కోటి 92 లక్షలతో ఆర్అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేశారు.
- పాత ఇంజరం వద్ద రూ.3 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి మరమ్మతులు చేపట్టారు.
- రూ.25 కోట్లతో నియోజకవర్గంలో ఓహెచ్‌ఆర్‌లు, 300 కిలోమీటర్ల మేర పైపులైన్ల పనులు చేపట్టారు.
-20,878మంది మత్స్యకార కుటుంబాలకు రూ.133 కోట్లు పంపిణీ చేశారు.

ప్రధాన సమస్యలపై..

గౌతమీ, వృద్ధగౌతమీ నదీపాయల వెంబడి రివిట్‌మెంట్ల నిర్మాణం చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా 4 కిలోమీటర్ల మేర పిచ్చింగ్, రివిట్‌మెంట్‌కు రూ.230 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధంచేసి ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. 44.50 కోట్ల అంచనా వ్యయంతో గుత్తెనదీవి-గోగుల్లంక, జి.మూలపొలం-పల్లంకుర్రు మధ్య వారధుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

గిడ్డి సత్యనారాయణ, జనసేన ఎమ్మెల్యే, పి.గన్నవరం



-నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి శరవేగంగా సాగుతోంది.
- రూ.32 కోట్ల ప్యాకేజీతో నాలుగు రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పి.గన్నవరం-మాచవరం మధ్య రహదారి నిర్మాణం పూర్తి అయింది.
- జి.పెదపూడి వద్ద రూ.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వారధి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తి కావచ్చాయి.
- అప్పనపల్లి-పాశర్లపూడి మధ్య రూ.8 కోట్ల అంచనా వ్యయంతో కాజ్‌వే, రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులు చేపట్టాల్సి ఉంది.
- నియోజకవర్గంలో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేదలకు వైద్య, ఆరోగ్య ఖర్చుల కింద ఏడాది కాలంలో కోట్లాది రూపాయల నిధులు పంపిణీ చేశారు.

ప్రధాన సమస్యలపై..

నియోజకవర్గ పరిధిలో వశిష్ఠ, వైనతేయ, గౌతమీ నదీపాయలను ఆనుకుని ఉన్న గ్రామాల్లో నదీ కోతకు గురవుతున్న భూముల రక్షణకు రివిట్‌మెంట్ల నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదన పెండింగ్ దశలో ఉంది. వీటితోపాటు ముక్తేశ్వరం-వీరవల్లిపాలెం మధ్య ఉన్న తొగరపాయపై వారధి నిర్మాణానికి ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. నదీ కోతకు గురవుతున్న భూములను రక్షించడానికి ప్రభుత్వం నిధులు మంజూరుచేయాలి.

దేవ వరప్రసాద్, జనసేన ఎమ్మెల్యే, రాజోలు



- నియోజకవర్గ స్థాయిలోని వివిధ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం సుమారు రూ.50 కోట్ల వ్యయం కాగల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కండకర్లు ఏర్పాటుచేశారు.
- గుడిమెళ్లంక వాటర్ ప్రాజెక్టు ద్వారా అన్ని గ్రామాల్లో తాగునీటిని అందించేందుకు చేపట్టిన చర్యలు ఫలవంతమయ్యాయి.
- సీఎంఆర్ఎఫ్ ద్వారా పేద ప్రజలకు వైద్య ఆరోగ్య ఖర్చుల కింద భారీగా నిధులను మంజూరు చేయించి ఆ కుటుంబాలను ఆదుకోవడంలో ఎమ్మెల్యే కృషిని ప్రశంసిస్తున్నారు.
- నియోజకవర్గ స్థాయిలో ఉపాధిహామీ పథకంతో పాటు వివిధ పథకాలతో ఎంపీ ల్యాడ్స్, సీఎస్సార్ నిధులతో సీసీ రోడ్లు, ఇతర నిర్మాణాలను కొనసాగిస్తున్నారు.

ప్రధాన సమస్యలపై..

సముద్ర తీర ప్రాంత గ్రామాలైన గొంది, కరవాక వంటి ప్రాంతాలకు మంచినీటిని అందించి ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కృషి చేస్తున్నారు. ఆ రెండు గ్రామాలకు త్వరలోనే మంచినీటి పథకం అమలు ద్వారా ఆ గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించడానికి సన్నాహాలు చేపట్టారు. వీటితోపాటు రూ.1800 కోట్ల అంచనా వ్యయంతో వాటర్ గ్రిడ్ పథకాన్ని అమలుచేసే క్రమంలో బొబ్బర్లంక నుంచి నియోజకవర్గానికి ప్రత్యేక పైపులైను ఏర్పాటు చేసే ప్రతిపాదనలపై ఐఏఎస్‌గా తనకున్న అనుభవంతో పనిచేస్తున్నారు.

14 వరకు దశల వారీగా జిల్లాస్థాయి యోగా పోటీలు

- విజేతలకు ప్రధాని మోదీతో యోగా కార్యక్రమంలో పాల్గొనే అవకాశం

అమలాపురం టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 14వతేదీ వరకు దశలవారీగా జిల్లాస్థాయి యోగా పోటీలను నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు.యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా యోగాపై అభిరుచి ఉన్న వారంతా జిల్లాస్థాయి యోగా పోటీల్లో పాల్గొని తమ ఖ్యాతిని జాతీయస్థాయిలో ఇనుమడింపచేయాలని పిలుపునిచ్చారు.కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో బుధవారం జిల్లాస్థాయి యోగా పోటీలను ప్రారంభించారు. 10 నుంచి 18ఏళ్ల మధ్య వయసుగలవారు, 19నుంచి 35 ఏళ్ల మధ్య వయసు గలవారు, 35 ఏళ్లపైబడిన విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈనెల 14వరకు దశలవారీగా ఈ పోటీలు జరుగుతాయన్నారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన వారు ఈనెల 21న విశాఖపట్నంలోజరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోదీతో యోగాలో పాల్గొనే అవకాశంఉంటుందన్నారు. యోగాపై పాటలు పాడిన వారికి రూ.లక్ష వరకు నగదు బహుమతి అందజేస్తారని కలెక్టర్ తెలిపారు. యోగాపోటీలకు న్యాయనిర్ణేతలుగా ఆయుష్ వైద్యాధికారులు డాక్టర్ కె.విజయకుమారి, డాక్టర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ కనకదుర్గ, కంకిపాటి వెంకటేశ్వరరావు, జి.దుర్గాప్రసాద్, ఉషారాణి, శాంతకుమారి వ్యవహరించారు.

నేడు యోగాపై పలు పోటీలు..

యోగా మాసోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లోని గోదావరిభవన్‌లో గురువారం సింక్రానజ్డ్ యోగా, యోగా పాటలు, యోగా పెయింటింగ్‌లు, యోగా స్కిట్, రోల్‌ప్లే పోటీలు ఉదయం 7.30గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తామని యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి డాక్టర్ విజయకుమారి తెలిపారు. ఆసక్తి గలవారు పాల్గొవచ్చునన్నారు.

నేటినుంచి పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం

అమలాపురం రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 132 కేవీ రామచంద్రపురం, కొత్తపేట, ముమ్మిడివరం డబుల్‌సర్క్యూట్ లైన్‌లో పాడైన 30టవర్ల మరమ్మతు పనుల్లో భాగంగా ఈనెల 12నుంచి 16వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఎస్ఈ సిద్దెల రాజబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు దఫదఫాలుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన చెప్పారు. ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అమలాపురం పట్టణం, అమలాపురం రూరల్, అల్లవరం, అంబాజీపేట, అయినవిల్లి, కొత్తపేట, రావులపాలెం, రాజోలు, మామిడికుదురు పి.గన్నవరం, మలికిపురం, సఖినేటిపల్లి, రామచంద్రపురం టౌన్, ద్రాక్షారామ, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఎస్ఈ రాజబాబు కోరారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం
● 12 జూన్ 2025

కౌన్సెలింగ్

పసికందులకు ఎలాంటి ఘనాహారం?

Q A

డాక్టర్! మా బాబుకు ఐదో నెల. ఆరో నెల నుంచి ఘనాహారం మొదలుపెట్టాలని అనుకుంటున్నాం. బిడ్డకు ఏడాది వయసొచ్చేవరకూ ఎలాంటి ఆహారం అందించాలో వివరించగలరు? - ఓ సోదరి, హైదరాబాద్

ఆరో నెల నుంచి సాధారణంగా అన్నంలో పప్పు, నెయ్యి కలిపి తినిపించడం మొదలు పెడతాం! కానీ వీటి ద్వారా బిడ్డకు అందే పోషకాలు అతి స్వల్పం. కాబట్టి....

- పప్పుధాన్యాలు, అన్ని రకాల కూరగాయలు, పులుపు లేని పళ్లు తినిపించాలి. రుచి కోసం చాలా పరిమితంగా నెయ్యి వాడొచ్చు. లేదంటే ఏదైనా వెజిటబుల్ ఆయిల్ అయినా అన్నంలో కలిపి పెట్టొచ్చు.
- ఉప్పు, తీపి... ఈ రెండూ రుచిని పెంచే మాట నిజమే అయినా, పసికందులకు వీటిని అలవాటు చేయకూడదు. వీటికి బదులుగా రుచి కోసం పసుపు, దాల్చిన చెక్క, యాలకులు, సోంపు, అల్లం, వెల్లుల్లి పేస్ట్, జీలకర్ర, ధనియాల పొడులను వంటకాల్లో కలిపి తినిపిస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.
- తీపి పెట్టాలనుకుంటే తగు మాత్రంగా బెల్లం వాడొచ్చు. నీళ్లు తాగడానికి ఇష్టపడకపోతే బెల్లం లేదా పళ్ల ముక్కలు వేసి తాగించవచ్చు.
- తొమ్మిదో నెల నుంచి గుడ్డు పచ్చసొన తినిపించవచ్చు.
- ఉడికించే ఆహారం మెత్తగా ఉండాలి.
- ప్రతి పూటా అన్నమే తినిపించాలని లేదు. అన్నం బదులు కూరగాయ ముక్కలను తగుపాళ్లలో మసాలాలు జోడించి తినిపించవచ్చు. ఉడికించి, చిదిమిన పళ్ల ముక్కలు తినిపించవచ్చు.



- పెద్దలతో సమానంగా పిల్లలూ మూడు పూటలు తినాలి అనుకుంటే పొరపాటు. ఒకేసారి ఎక్కువ పరిమాణాల్లో పిల్లలు తినలేకపోతే, అదే పరిమాణాన్ని 6 భాగాలుగా వేర్వేరు సమయాల్లో తినిపించవచ్చు.
- సెరెలాక్ లాంటి ప్రత్యామ్నాయ మిల్క్ ఫుడ్స్, ప్రయాణాల్లో, ఇంటి భోజనం వండలేని సమయాల్లో మాత్రమే ఇవ్వాలి. దీన్లో చక్కెర కలపకూడదు.

ఇవి కూడదు...

పిల్లలకు తినిపించకూడని పదార్థాలు కూడా ఉన్నాయి. అవేంటంటే...

- అలర్జీ తలెత్తకుండా ఉండడం కోసం కొత్తగా ఏ రెండు కొత్త పదార్థాలను కలిపి తినిపించకూడదు. ఒకదాని తర్వాత మరొకటిగానే రుచి అలవాటు చేయాలి.
- ఈ వయసు పిల్లలకు నట్స్ నుంచి అలర్జీ లాంటి ఇబ్బందులు తలెత్తవచ్చు. కాబట్టి వేరుశనగ, బాదం, జీడిపప్పు లాంటివి పొడి రూపంలో కూడా తినిపించకూడదు.
- సంవత్సరం లోపు పిల్లలకు తేనె, ఉప్పు, చక్కెర తినిపించకపోవడమే మంచిది. తీయదనం కోసం బెల్లం వాడొచ్చు.
- బాస్మతి లాంటి పాలిష్ పట్టిన బియ్యం వాడకూడదు.
- ఐస్‌క్రీమ్‌లు, బిస్కెట్లు, చాక్లెట్లు, శీతల పానీయాలు, కొబ్బరి నీళ్లు ఇవ్వకూడదు. - **డాక్టర్ సుమతి,** పిడియాట్రీషియన్, హైదరాబాద్

అభిరుచి



అలనాటి అరుదైన నటి సూర్యకాంతం. పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశం చేసి... మరెవరికీ సాధ్యంకాదన్న రీతిలో అభినయించి... తెలుగు తెరపై తనదైన ముద్ర వేశారు. ఇది దశాబ్దాల కిందటి కథ మళ్లీ ఇప్పుడు ఆ నట విన్యాసాన్ని అనుకరించి... సూర్యకాంతాన్ని మరిపించి... తెలుగు ప్రేక్షకులను మురిపిస్తోంది... మంజూష ముక్కవిల్లి. వెండితెరపై నాటి అపురూప సన్నివేశాలను ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో పండించి... టాలీవుడ్ తారల ప్రశంసలు సైతం అందుకున్న మంజూషతో 'నవ్య' ముచ్చట్లు.

అచ్చం సూర్యకాంతంలా!

"ఒక అభిరుచి... చిన్నప్పుడే నాలో బలంగా నాటుకుపోయింది. అది మరేదో కాదు... నటించాలన్న తపన. నాకు తెలియకుండానే నాలోని నటుణ్ణి బయటకు తీసే ప్రయత్నం ఎప్పటికప్పుడూ చేస్తూనే ఉన్నాను. బడికి వెళ్లే రోజుల్లో... కాలేజీలో చదివే సమయంలో... అవకాశం దొరికినప్పుడల్లా అలనాటి మేటి తారల్లా అభినయిస్తూ వస్తున్నాను. నటులే కాదు... ఇంట్లోవాళ్లు, సన్నిహితులను అనుకరించడం కూడా నాకు ఒక అలవాటుగా మారిపోయింది. అమ్మమ్మలు, బామ్మలు, తాతయ్యలు... ఇలా పెద్దవాళ్ల హావభావాలను సరదాగా నాలో పలికిస్తుండేదాన్ని. దాంతోపాటు పాటలు పాడేదాన్ని. డ్యాన్స్ చేసేదాన్ని. చూసినవాళ్లందరూ బాగా ఆస్వాదించేవారు. అభినందించేవారు. వారి పొగడ్తలు నాకు మరింత ప్రోత్సాహాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చేవి. అలా మొదలైంది నా ఈ ప్రయాణం. మా ఊరు భద్రాచలం. నేను అక్కడే పుట్టి పెరిగాను. 2010లో హైదరాబాద్‌లో ఎంబీయే పూర్తయింది.

ఉద్యోగం... పెళ్లి...

డిగ్రీ అవ్వగానే ఓ ఆంగ్ల పత్రికలో ఏడాదిన్నర సేల్స్ మార్కెటింగ్ విభాగంలో పని చేశాను. తరువాత ఆరేళ్ల రేడియో సిటీలో ఉద్యోగం. అక్కడ మార్కెటింగ్‌తో పాటు ప్రకటనలకు వాయిస్ ఓవర్ ఇచ్చేదాన్ని. అదే సమయంలో నాకు పెళ్లయింది. మావారు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు. తన ఉద్యోగ నిమిత్తం ఫ్రాన్స్‌కు వెళ్లాం. కొన్నాళ్లకు తిరిగి భారత్‌కు వచ్చేశాం. ఆయనకు మంచి ఉద్యోగ అవకాశం రావడంతో 2021లో అమెరికాకు పయనమయ్యాం. ప్రస్తుతం ఇక్కడే నివాసం.

అమెరికా వచ్చాక...

మొదటి నుంచీ అందర్నీ అనుకరించడంవల్ల క్రమంగా నా ఆసక్తి నటన వైపు మళ్లింది. అమెరికా వచ్చాక అనిపించింది... ఒక ప్రయత్నం చేద్దామని. ఒకప్పుడంటే సినిమాలు, టీవీలు మినహా వేరే అవకాశాలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు సామాజిక మాధ్యమాల వల్ల మన ప్రతిభ ప్రపంచానికి చూపడానికి అనువైన ఒక చక్కని వేదిక అందుబాటులో ఉంది కదా. దాని ద్వారా నాలోని నటిని సంతృప్తి పరచాలని అనుకున్నా. చిన్నప్పటి నుంచీ ఇమిటేట్ చేస్తున్నాను కాబట్టి... కంటెంట్ కూడా దానికి సంబంధించే పెట్టాలనుకున్నా. అలా మూడేళ్ల కిందట ఇన్‌స్టాగ్రామ్‌లో నా పేరు మీదనే ఒక చానల్ ప్రారంభించాను.

నిర్మలమ్మ గారి రీల్‌తో...

చదువుకొనే రోజుల్లో డ్రామా, డ్యాన్స్ ప్రదర్శనలు ఇచ్చేదాన్ని. కాలేజీలోనే కాదు... బయటి వేదికలపై కూడా. కానీ ఎవరి దగ్గరా శిక్షణ తీసుకోలేదు. అన్నీ నాకు నేను చూసి నేర్చుకున్నవే. ఇన్‌స్టాలో చిన్న చిన్న వీడియోలు చేసి పెట్టాను కానీ... వాటికి అంత గుర్తింపు రాలేదు. 'శ్రీ కనకమహాలక్ష్మి రికార్డింగ్ డ్యాన్స్ ట్రూప్' చిత్రంలో నిర్మలమ్మ గారు నటించిన కోడి సన్నివేశం ఒకటి ఉంటుంది. ఆ బిట్ నేను చేశాను. దానికి మంచి స్పందన వచ్చింది. లక్షల మంది వీక్షించారు. అంతకు మించి షేర్ చేశారు. నాకు మంచి గుర్తింపు తెచ్చింది. ఆ ఉత్సాహంతో సూర్యకాంతం గారిని అనుకరించే ధైర్యం చేశా.

'ఏంటి నేను ఇంత లావున్నానా'...

అయితే నాకు బాగా పేరు వచ్చింది మాత్రం సూర్యకాంతం గారి వీడియోతో. రేలంగి గారితో కలిసి ఆమె నటించిన 'ఏంటి నేను ఇంత లావున్నానా' సన్నివేశం ఒకటి ప్రయత్నించాను. ఆ రీల్‌కు ఊహించనంత స్పందన లభించింది. సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొట్టింది. నాకు బాగా పేరు వచ్చింది. ఇక అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఏ వీడియో పెట్టినా లక్షల్లో వ్యూస్. తరువాత ఛాయాదేవి గారిని అనుకరించాను. వాటికీ విపరీతమైన ఆదరణ లభించింది. వాస్తవానికి ఆ సలహా ఇచ్చింది రఘు కుంచె గారు. 'మీరు ఛాయాదేవి గారి పాత్రలు కూడా ప్రయత్నించండి. బాగా చేస్తారు' అన్నారు. ఆయన చెప్పాకే ఆవిడవి మొదలుపెట్టాను.

ఐదు వందలకు పైనే...

ఇప్పటివరకు నేను ఐదు వందలకు పైగా వీడియోలు చేశాను. ఇన్‌స్టాలో లక్షన్నర మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. అత్యధికంగా చూసిన వీడియో సూర్యకాంతం గారిది. దానికి వ్యూస్ రెండు కోట్లు దాటాయి. ఆ తరువాత వరుసలో బ్రహ్మానందం, నిర్మలమ్మ, ఛాయాదేవి గారి వీడియోలు. అన్నీ నా మొబైల్ ఫోన్ తోనే తీస్తాను. ముందుగా సన్నివేశం ఏంటనేది నిర్ణయించుకొని, ఓ అరగంట సాధన చేసి, నటిస్తాను. ఎడిటింగ్ లాంటివన్నీ నేనే చూసుకొంటాను. ఒక్కో వీడియోకు సగటున ఐదు లక్షల వ్యూస్ వస్తాయి. కాస్ట్యూమ్స్ ఇంట్లో ఉన్నవాటితోనే సరిపెడుతుంటా. అవి కుదరకపోతే షాపింగ్ చేస్తాను. కొన్ని భారత్ నుంచి కూడా తెప్పిస్తుంటాను. ఇక్కడ ఒక్కటే చెప్పదలుచుకున్నాను... సామాజిక మాధ్యమాలవల్ల ప్రతికూలతలు, అలాగే అనుకూలతలు కూడా ఉన్నాయి. దాన్ని మనం ఎలా ఉపయోగించుకొంటామనేది ముఖ్యం. ఒకప్పుడు నేరుగా వెళ్లి వేషాలు అడగాలంటే భయపడేదాన్ని. కానీ రీల్స్ వల్ల నాకు ఆ భయం పోయింది. నన్ను నేను ప్రపంచానికి పరిచయం చేసుకోగలిగాను. ఇది నాకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తోంది. కాస్త గర్వంగానూ అనిపిస్తుంది."

● హనుమా

మధుర జ్ఞాపకాలెన్నో...



ప్రముఖ నటుడు హర్షవర్ధన్ గారు ఒక ఇంటర్వ్యూలో నా గురించి ప్రత్యేకంగా చెప్పారు. సూర్యకాంతంలా బాగా నటిస్తున్నానని. ఆ వీడియో ఎవరో నాకు పంపించారు. చూసి ఆశ్చర్యపోయాను. ఆయనతో నాకు పరిచయం లేదు. ఒక మెసేజ్ కూడా పంపారు... 'ఆ బాడీ లాంగ్వేజ్, ఆ వాయిస్ అనుకరణ అంత సులువు కాదు. కానీ మీరు సూర్యకాంతంలా అతికినట్టు చేస్తున్నారు. నేను మీకు పెద్ద అభిమానిని. మా కుటుంబం అంతా కూర్చొని మీ వీడియోలు చూస్తాం' అని. అలాగే సంగీత దర్శకుడు తమన్ తన ఇన్‌స్టా స్టోరీలో నా వీడియోలు షేర్ చేశారు. చార్మి, అవసరాల శ్రీనివాస్, నందినీరెడ్డి లాంటి పరిశ్రమ ప్రముఖులు అభినందన మెసేజ్‌లు పంపడమే కాదు, వాటిని ఇతర సామాజిక మాధ్యమాల్లో పంచుకొంటున్నారు కూడా. కొంత మంది అసిస్టెంట్ డైరెక్టర్‌లు, సినిమాటోగ్రాఫర్‌లు 'అవకాశం వస్తే సినిమాల్లో నటిస్తారా' అని అడుగుతున్నారు. తప్పకుండా చేస్తానని వారికి చెప్పాను. నా లక్ష్యం కూడా అదే.

అదే నా బలం...

నేను చిన్నప్పటి నుంచీ సూర్యకాంతం, నిర్మలమ్మ సినిమాలు ఆసక్తిగా చూసేదాన్ని. దాంతో వాళ్ల నటన మీద కొంత అవగాహన వచ్చింది. ప్రత్యేకించి సూర్యకాంతాన్ని అనుకరించడం చాలా కష్టమనేది చాలామంది చెప్పే మాట. ఆవిడ డైలాగ్ డెలివరీ వేగంగా సాగిపోతుంది. డైలాగ్‌కు డైలాగ్‌కు మధ్య విరామం ఉండదు. నటనలో, మాటలో ఫోర్స్ ఉంటుంది. కానీ ఏదీ తెచ్చిపెట్టుకున్నట్టు కాకుండా, ఎంతో సహజంగా అనిపిస్తుంది. ఇంకో ప్రత్యేకత ఏంటంటే... నిలుచున్న మనిషి నిలుచున్నట్టే, కదలకుండా డైలాగులు చెప్పేస్తారు. అలా మా ఇంట్లో నాయనమ్మలు, అమ్మమ్మలను చూసేదాన్ని. వాళ్లను అనుకరించడంవల్ల ఇప్పుడు నేను ఇంత బాగా చేయగులుగుతున్నాను. కాంచన, భానుమతి, బ్రహ్మానందం, కోవై సరళ, ఆమని, సౌందర్య తదితరులని కూడా అనుకరిస్తుంటాను. ఎవరినైనా చూస్తే వారి హావభావాలను వెంటనే పట్టేయగలను. అదే నా బలం.

చెద పురుగులు పట్టాయా?

కంప్యూటర్ టేబుల్, డైనింగ్ టేబుల్ వద్ద కలరా వుండలు ఉంచితే చెద పురుగులు చేరవు.

మన ఇంట్లో చెక్క అల్మారాలు, మంచాలు, తలుపులకు చెద పురుగులు పడుతూ ఉంటాయి. ఎంతో ఖరీదైన చెక్కను తెచ్చి ఇష్టంగా చేయించుకున్న అరలతో సహా పుస్తకాలు, దుస్తులను కూడా ఇవి పాడుచేస్తుంటాయి. ఒకసారి చేరితే వీటిని వదిలించుకోవడం చాలా కష్టం. రసాయనాలతో కూడిన స్ప్రేలకు బదులు కొన్ని ఇంటి చిట్కాలు ఉపయోగించి కొంతమేరకు వీటి బెడదను తగ్గించుకోవచ్చు.

- చెద పురుగులను నివారించడంలో కర్పూరం పొడి ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇవి ఎక్కువగా చేరే మంచాలు, తలుపులు, కిటికీలు, అరల మూలల్లో సందుల్లో కర్పూరం పొడిని చల్లితే రెండు రోజుల్లో మంచి ఫలితం కనిపిస్తుంది.
- ముదురు వేపాకులను తెచ్చి ఎండబెట్టి మెత్తని పొడిలా చేయాలి. ఈ పొడిని గది మూలల్లో, అరల్లో, చెక్క సమాన్ల మీద చల్లితే వారం రోజుల్లో చెద పురుగులన్నీ చనిపోతాయి.
- పుస్తకాలు, దుస్తులు భద్రపరచుకునే చెక్క బీరువాల్లో;
- చెదపురుగులు ఉన్నాయన్న అనుమానం వచ్చిన ప్రదేశాల్లో చిటికెడు నల్ల జీలకర్ర ఉంచినా మంచి ఫలితం కనిపిస్తుంది.
- మంచాలు, సోఫాలు, టేబుళ్లు, కుర్చీల మీద కొద్దిగా వెనిగర్ చిలకరిస్తే ప్రయోజనం ఉంటుంది.
- ఇంట్లో ఉండే సామాన్లు, పుస్తకాలను ఎక్కువకాలం ఒకేచోట ఉంచకుండా కనీసం ఆర్నెల్లకోసారి కదిలిస్తూ ప్రదేశాలు మారుస్తూ ఉంటే చెదలు చేరవు.



లీచీ.. ఔషధ గుణాలెన్నో



ఎర్రగా చూడగానే తినేయాలనిపించే లీచీ పండు వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం..

- లీచీల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తికి ఊతమిస్తుంది.
- ఈ పళ్లలోని ఫైబర్ అజీర్తి, మలబద్ధకం సమస్యలను దూరం చేస్తుంది.
- లీచీల్లో నీటి శాతం ఎక్కువ. కాబట్టి డీహైడ్రేషన్ ముప్పు తప్పుతుంది.
- లిచి పళ్లలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె సమస్యలను ఇది దరిచేరనీయదు.
- లీచీల్లో క్యాలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. కాబట్టి బరువు నియంత్రణకు ఈ పండ్లు బాగా ఉపయోగపడతాయి.
- ఇందులోని విటమిన్ సి, యాంటిఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

వంటగది శుభ్రం ఇలా..

అద్దంలా మెరిసే వంటగది అహ్లాదకరంగా ఉంటుంది. వంటగది పరిశుభ్రంగా లేకపోతే క్రిమి కీటకాలు చేరడమే కాకుండా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వంట చేసేటప్పుడు చికాకుగా అనిపిస్తుంటుంది. కాబట్టి ఇంట్లో దొరికే వస్తువులతో సులువుగా వంటగదిని ఎలా శుభ్రం చేసుకోవాలో తెలుసుకుందాం...

- వంట చేసేటప్పుడు వెలువడే పొగ, ఆవిరి వల్ల స్టవ్ వెనక గోడపై అమర్చిన టైల్స్ మీద జిడ్డు చేరుతూ ఉంటుంది. ఒక్కోసారి పసుపు, కారం, మసాలాల మరకలు కూడా పడుతుంటాయి. అలాంటప్పుడు ఒక గిన్నెలో నాలుగు చెంచాల నిమ్మరసం, రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి పేస్టులా కలపాలి. ఈ మిశ్రమాన్ని టైల్స్ మీద రాసి రెండు నిమిషాల తరవాత స్క్రబ్బర్ లేదా స్పాంజ్‌తో రుద్దాలి. తరవాత గోరువెచ్చని నీళ్లతో కడిగేస్తే టైల్స్ చక్కగా శుభ్రమవుతాయి. వంట పూర్తయిన వెంటనే టిష్యూ పేపర్‌తో టైల్స్‌ని తుడిచేస్తే ఏ సమస్యా ఉండదు.



- వంట చేస్తున్నప్పుడు స్టవ్ కింద, దాని చుట్టూ కూడా ఆహార పదార్థాలు చింది పడుతూ ఉంటాయి. వంట పూర్తయిన తరవాత వీటిని పలుచని గుడ్డతో శుభ్రంగా తుడవాలి. రెండు గ్లాసుల గోరువెచ్చని నీళ్లలో ఒక చెంచా ఉప్పు, రెండు చెంచాల వెనిగర్ లేదా లిక్విడ్ సోప్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గట్టు మీద చల్లి పది నిమిషాలు ఉంచాలి. తరవాత వేడినీళ్లు పోసి కడిగేస్తే గట్టు పూర్తిగా శుభ్రపడుతుంది. ఇదేవిధంగా స్టవ్‌ని కూడా శుభ్రం చేయవచ్చు.
- వంటగదిలో ఉండే ట్యూబ్‌లైట్, ఎగ్జాస్ట్ ఫ్యాన్, స్విచ్ బోర్డులతోపాటు కిటికీ ఊచలు, తలుపులు కూడా జిడ్డు పట్టి దుమ్ము, ధూళితో నిండుతుంటాయి. అలాంటప్పుడు సర్ఫ్ లేదా లిక్విడ్ సోప్ కలిపిన నీళ్లలో ముంచి గట్టిగా పిండిన స్పాంజ్‌తో వీటిని తుడిచేస్తే సరిపోతుంది.
- అటకమీద, అరల్లో తరచూ బూజు పడుతూ ఉంటుంది. దీన్ని మెత్తని చీపురు లేదా వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేయాలి. అరల మూలల్లో కర్పూరం బిళ్లలు, లవంగాలు, వేపాకుల్లో ఒకటి ఉంచితే బొద్దింకలు చేరవు.
- వంటగదిలో నేలను ప్రతిరోజూ ఉప్పునీటితో తుడవాలి. పాత్రలు కడిగే సింక్‌లో కొన్ని వేడి నీళ్లు పోసి బ్రష్‌తో రుద్ది శుభ్రం చేయాలి.

స్ఫూర్తి



డైవింగ్ సంచలనం

ఎలాంటి పరికరాలు లేకుండా ఊపిరి బిగపట్టి లోతైన నీళ్లలోకి డైవ్ చేయడమే ఫ్రీ డైవింగ్. ఎంతో కష్టమైన, క్లిష్టమైన ఈ క్రీడలో పైచేయి సాధించడమే కాకుండా, ఏకంగా తొమ్మిది జాతీయ రికార్డులను నెలకొల్పారు చెన్నైకి చెందిన 32 ఏళ్ల అర్చన శంకర నారాయణన్. ఈ మహిళా డైవర్ గురించిన ఆసక్తికరమైన విశేషాలివి.

ఆరేళ్ల కిందట... కొత్త సంవత్సర వేడుకల కోసం అండమాన్‌కు వెళ్లినప్పుడు, అర్చనకు మొదటిసారిగా డైవింగ్ చేసే అవకాశం దొరికింది. అలా జీవితంలో మొదటిసారిగా స్కూబా డైవింగ్ చేశారామె. ఆ అనుభవం గురించి వివరిస్తూ... "నాకా అనుభవం ఎంతో బాగా నచ్చింది. నీటి అడుగున దాగి ఉండే అద్భుతమైన ప్రపంచాన్ని నేనప్పుడు మొదటిసారిగా చూడగలిగాను. సముద్రంతో తక్షణ అనుబంధం ఏర్పడిపోయిన భావనకు లోనయ్యాను. నీటి ప్రపంచంలో నెలకొని ఉండే ప్రశాంతత, నిశ్శబ్దం నన్నెంతో అబ్బురపరిచాయి. అలా మొదటి అనుభవంతోనే డైవింగ్‌కు ఎంతో దగ్గరైపోయాను. నా భవిష్యత్తు డైవింగ్‌తో ముడిపడి ఉందని అనిపించింది. కానీ అప్పటికే న్యాయవాద వృత్తిలో ఉన్నాను. కాబట్టి డైవింగ్ పట్ల ఏర్పడిన మక్కువను నా తల్లితండ్రులు అర్థం చేసుకోలేకపోయారు. అది ప్రాణాంతకమైన క్రీడ కాబట్టి వాళ్లు బాగా భయపడిపోయారు. మాది సంప్రదాయ తమిళ కుటుంబం. న్యాయవాద వృత్తిని వదిలేసి, ప్రాణాంతకమైన డైవింగ్‌లో కొనసాగాలనే నా కోరికను మొదట్లో వ్యతిరేకించిన తల్లితండ్రులు చివరకు అర్థం చేసుకుని ప్రోత్సహించారు. ఇప్పుడు నన్ను చూసి గర్వపడుతున్నారు" అంటూ తన డైవింగ్ ప్రయాణాన్ని వివరిస్తున్నారు అర్చన.

మక్కువతో మథించి...

ఆ ప్రయాణంలో భాగంగా మొదట బహిరంగ జలాల స్కూబా అడ్వాన్స్‌డ్ సర్టిఫికేషన్‌ను పొంది, రెస్క్యూ డైవర్‌గా మారారు. ఆ తర్వాత, ఎటువంటి ఆక్సిజన్ ఆసరా లేకుండా ఫ్రీడైవింగ్ చేసే భారత దేశానికి చెందిన శుభమ్ పాండే వీడియోలు చూసి అతని నుంచి ఎంతో ప్రేరణ పొందారు. ఆ సందర్భం గురించి మాట్లాడుతూ.. "నన్నీ క్రీడ విపరీతంగా ఆకర్షించింది. కేవలం రెస్క్యూ డైవర్‌గా స్థిరపడిపోకుండా, ఈ క్రీడలో మరింత పరిణతి సాధించాలని అనుకున్నాను. శుభమ్ వీడియోలు చూసిన తర్వాత, అతని దగ్గర శిక్షణ పొందాలని అనిపించింది. దాంతో బాలి వెళ్లి, భారతీయ అగ్ర ఫ్రీడైవింగ్ శిక్షకుల్లో ఒకడైన శుభమ్ దగ్గర శిక్షణ తీసుకున్నాను. ఆ తర్వాత, ఆసియాలోని సుప్రసిద్ధ ఫ్రీడైవింగ్ స్కూల్, అప్నియా బాలిలో కూడా శిక్షణ పొందాను" అంటూ చెప్పుకొచ్చారు అర్చన. శిక్షణలో భాగంగా ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడం కోసం విజువలైజేషన్, బ్రెత్‌వర్క్, ధ్యానం... సాధన చేశారామె. డయాఫ్రమ్ బ్రీదింగ్ లాంటి శ్వాస నైపుణ్యాలను సాధన చేయడం ద్వారా డైవింగ్ నైపుణ్యాన్ని పెంచుకోవడంతో పాటు, మహాసముద్రంలో ఆత్మవిశ్వాసంతో డైవింగ్ చేయగలిగే సామర్థ్యం కూడా పెరిగిందని అంటున్నారామె. అలాగే థాయిల్యాండ్‌లోని కొ టావోలో కైజెన్ ఫ్రీడైవింగ్‌లో కూడా అర్చన శిక్షణ తీసుకున్నారు. ఫ్రీడైవింగ్ ప్రపంచ రికార్డులు, 100 మీటర్లను అధిగమించాయి కాబట్టి భారతదేశ డైవర్లు ఈ క్రీడలో పైచేయి సాధించడానికి కఠోర శిక్షణ పొందడం అవసరమని గ్రహించిన అర్చన, ప్రస్తుతం తన శిక్షణ తీవ్రతను పెంచారు. "ఆగస్టు 1 నుంచి 3 వరకు, ఇండోనేషియాలోని, నార్త్ సులవేసిలో జరగబోయే మనాడొ డెప్త్ కాంపిటీషన్‌లో నెగ్గడం కోసం, శుభమ్ పాండేతో కలిసి ఇండోనేషియాలోని అమెద్‌లో శిక్షణ తీసుకుంటున్నాను" అంటూ చెప్పుకొస్తున్నారు.

లోతులన్నీ నెగ్గి...

అర్చన తాజాగా ఫిలిప్పైన్స్‌లో జరిగిన రెండు ప్రధాన అంతర్జాతీయ పోటీల్లో ఆరు కొత్త జాతీయ రికార్డులను నెలకొల్పారు. ఈ చెన్నై యువతి, రెండు అంతర్జాతీయ పోటీల్లో ఆరు జాతీయ రికార్డులను బద్దలు కొట్టడంతో పాటు, 35 మీటర్ల జాతీయ రికార్డును నెలకొల్పి, 42 మీటర్ల ఫ్రీడైవింగ్ తో స్వీయ వ్యక్తిగత ప్రతిభను కనబరచడం విశేషం. ఇలా ఏడాది వ్యవధిలో తొమ్మిది రికార్డులను నెలకొల్పిన తొలి భారతీయ మహిళా ఫ్రీడైవర్‌గా చరిత్ర సృష్టించారు. ఫ్రీడైవింగ్ ఊపిరిని బిగపట్టే క్రీడ. ఈ క్రీడలో పాల్గొనే క్రీడాకారులు ఎలాంటి శ్వాస పరికరాలు లేకుండా, నీటి అడుగున వీలైనంత లోతుకు ఫ్రీడైవింగ్ చేస్తూ ఉంటారు. అర్చన, గత నెలలో ఫిలిప్పైన్స్‌లోని మబినిలో జరిగిన ఎబిడిఎ మబిని డెప్త్ క్వెస్ట్‌లో పాల్గొని, తన రికార్డును బద్దలు కొట్టడంతో పాటు నాలుగు జాతీయ రికార్డులతో తన అసమానమైన ప్రతిభను చాటుకున్నారు. అనంతరం ఫిలిప్పీన్స్ పాంగ్లోలో జరిగిన హగ్ కప్ పోటీల్లో, మరొక సొంత రికార్డుతో పాటు, రెండు జాతీయ రికార్డులను నెలకొల్పారు. ఇలా ఇప్పటివరకూ అర్చన, కాన్‌స్టెంట్ వెయిట్, కాన్‌స్టెంట్ వెయిట్ బై ఫిన్స్, కాన్‌స్టెంట్ వెయిట్ నో ఫిన్స్, ఫ్రీ ఇమ్మర్షన్... ఇలా ఈ క్రీడలోని నాలుగు డెప్త్ విభాగాల్లో జాతీయ రికార్డులను సాధించి భారత దేశ సత్తాను చాటారు.

ఫ్రీడైవింగ్... అంత సులువు కాదు

నీళ్ల అడుగుకి డైవ్ చేయడం, సులభతరమైన క్రీడలాగే అనిపించవచ్చు. కానీ నీళ్లలో లోతుకు ప్రయాణించేకొద్దీ నీటి ఒత్తిడి పెరిగిపోతుంది. ఆక్సిజన్ మోతాదులు తగ్గిపోతాయి. దాంతో మెదడుకు సరిపడా ఆక్సిజన్ అందక స్పృహ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఊపిరితిత్తుల మీద ఒత్తిడి పెరిగి, అవి కుంచించుకుపోతాయి. నీటి ఒత్తిడిలో చోటుచేసుకునే మార్పుల వల్ల కళ్లు, చెవులు, సైనస్‌లు, ఊపిరితిత్తులకు గాయలయ్యే అవకాశాలుంటాయి. లోతుకు చేరుకున్న తర్వాత అంతే వేగంగా నీళ్ల పైకి చేరుకునే వీలుండదు. అలా లోతు నుంచి వేగంగా నీటి పైకి ప్రయాణిస్తే, రక్తంలో నైట్రోజన్ బుడగలు ఏర్పడి, డీకంప్రెషన్ సిక్‌నెస్‌కు గురవుతారు.

ప్రియుడితో కలిసి... భర్తను హతమార్చిన భార్య

● తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో ఘటన ● కేసు నమోదు చేసిన పోలీసులు

బిక్కవోలు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): భర్తను భార్య తన ప్రియుడితో కలసి హత్య చేసిన సంఘటన మంగళవారం అర్థరాత్రి తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు జగనన్న కాలనీలో జరిగింది. అనపర్తి సీఐ సుమంత్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బిక్కవోలుకు చెందిన కెంగం శ్రీను (42)కు, అదే గ్రామానికి చెందిన దేవితో 20ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వారు గ్రామంలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నారు. శ్రీను కూలీ పనులు చేసుకుంటూ మద్యానికి బానిసై రోజు మద్యం తాగి వచ్చి దేవిని హింసించేవాడు. దీంతో ఆమె ఒక వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగించింది. శ్రీనుపై విరక్తి చెందిన దేవి ప్రియుడితో కలిసి మంగళవారం అర్ధరాత్రి మద్యంమత్తులో ఉన్న శ్రీను తలవెనుక, ముఖంపై గాయపరచి హతమార్చింది. కొట్టిన దెబ్బల కారణంగా శ్రీను చనిపోయాడని, తన కోడలు మరొకరు కలసి చంపేశారంటూ మృతుడి తల్లి సరస్వతి ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా శ్రీను ముఖంపై, తల వెనుక గాయాలున్నాయని, ఇద్దరు కలిసి కొట్టి చంపినట్టుగా భావిస్తూ కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు. దేవీ, ఆమె ప్రియుడు పరారీలో ఉన్నారన్నారు. రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి శ్రీను తల్లి నుంచి వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ ఆధారాలు తీసుకున్నారు. మృతదేహాన్ని అనపర్తి ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ ఉన్నారు.


శ్రీను మృతదేహం

బాబోయ్..భారీ వర్షం!

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కూరిసింది. గంటపాటు కురిసిన ఈ వర్షానికి హైటెక్ బస్టాండ్ మునిగింది. దీంతో వాహనదారులు బాబోయ్ అంటూ నీటిలో వాహనాలను తోసుకుంటూ, ఒకరికి ఒకరు సాయం చేసుకుంటూ వెళ్లారు.

రాజమహేంద్రవరంలో మునిగిన హైటెక్ బస్టాండ్



నీటిమయమైన హైటెక్ బస్టాండ్‌లో ఉండిపోయిన ప్రజలు


వర్షపు నీటిలో నుంచి చేతులు పట్టుకుని వస్తున్న ప్రజలు


నీటిలో పడకుండా భుజాలపై తరలిస్తూ..


వర్షం నీటిలో కారు

వాసాలతిప్పలో జస్వంత్ మృతదేహం లభ్యం

ఉప్పలగుప్తం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఎస్.యానాం బీచ్‌లో మంగళవారం ఇద్దరు యువకులు స్నానానికి దిగి గల్లంతైన సంగతి తెలిసిందే. వీరిలో అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన యాళ్ళ హరికిశోర్ మృతదేహం దొరికింది. కాగా అయినవిల్లి మండలం నేదునూరుకు చెందిన ఇసుకపట్ల జస్వంత్(19) మృతదేహం బుధవారం వాసాలతిప్ప ఓఎన్జీసీ సైట్ సమీపంలో లభ్యమైనట్టు ఎస్ఐ సీహెచ్. రాజేష్ తెలిపారు. తహశీల్దార్ వాసా వీఎస్ దివాకర్ రెవెన్యూ సిబ్బందితో కలిసి వాసాలతిప్పలో జస్వంత్ మృతదేహాన్ని పరిశీలించారు. సమీపంలో ఉన్న తండ్రి వెంకటరమణకు చూపించి పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.


జస్వంత్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ దివాకర్, ఎస్ఐ రాజేష్


జస్వంత్ ఫైల్‌ఫొటో

జేఎన్టీయూకేలో డైరెక్టరేట్ల మార్పు

జేఎన్టీయూకే, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పరిపాలనా సంస్కరణల్లో భాగంగా కాకినాడ జేఎన్టీయూలో ఉన్న పలు డైరెక్టరేట్లను మార్పు చేస్తూ ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ ఆదేశాల మేరకు వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐఎస్‌టీ డైరెక్టర్‌గా డాక్టర్ బీటీ కృష్ణ, ఐటీ, ఓఎల్, ఓడీఎల్‌కు సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కె.సహదేవయ్య, అలూమ్ని ఇంటర్నేషనల్ రిలేషన్స్ డైరెక్టర్‌గా ఎ.స్వర్ణకుమారిని నియమించారు. అదేవిధంగా స్టూడెంట్ ఎఫైర్స్‌కు ప్రొఫెసర్ కృష్ణమోహన్‌ను, ఐక్యూఏసీ డైరెక్టర్‌గా కె.రవీంద్రను, అడ్మిషన్స్, సెట్స్‌కు రాము నియమితులయ్యారు. ఎస్ఐఐఐసీకి ఎ.గోపాలకృష్ణ, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్‌గా ప్రొఫెసర్ జి.పద్మజారాణి, లీగల్‌మ్యాటర్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ బాలాజీ, అకడమిక్స్ డైరెక్టర్‌గా ఎంహెచ్ఎంకృష్ణప్రసాద్‌నునియమించారు.

ఆంజనేయస్వామి విగ్రహాన్ని బయటపడేసిన వ్యక్తి అరెస్ట్

రిమాండ్ విధింపు

తొండంగి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం పెరుమాళ్ళపురం పంచాయితీ శివారు చింతకాయలపేటలో ఉన్న సీతారాముల ఆలయంలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని బయటపడేసి నష్టం కలిగించిన వ్యక్తిని గుర్తించి అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. కొత్తపెరుమాళ్ళపురం గ్రామానికి చెందిన తిర్తి ప్రసాద్ (26) ఈ దుశ్చర్యకు పాల్పడినట్టు గుర్తించామన్నారు. మద్యం మత్తులో ఏమి చేస్తున్నాడో తెలియని పరిస్థితిలో ఆంజనేయ విగ్రహాన్ని బయటపడవేశాడన్నారు. బుధవారం ప్రసాద్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. ఇటువంటి చర్యలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నేటి నుంచి 'ఎరెవ్నా 4.0'

జీజీహెచ్(కాకినాడ) జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల, ఫార్మకాలజీ లెక్చర్ గ్యాలరీలో ఎరెవ్నా 4.0 సదస్సు గురువారం ప్రారంభంకానుంది. 3 రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు అతిథులుగా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ డీఎంఈ డాక్టర్ రఘునందన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి హాజరుకానున్నారు. ఈ సదస్సు ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో జరగనుంది. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వైద్యులు, వైద్య విద్యార్థులు హాజరుకానున్నారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల నైపుణ్యతను మరింత మెరుగుపర్చే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సదస్సులో వర్క్‌షాపులు, పేపర్ ప్రజంటేషన్‌లు, ప్రపంచవ్యాప్తంగా అధునాతన వైద్య పరమైన మార్పులు వాటిలో సానుకూలప్రతికూల అంశాలపై చర్చించనున్నారు.

నేడు చిరంజీవినీకుమారి సంస్మరణ సభ

కాకినాడ రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యావేత్త, మానవతావాది ఐడియల్ విద్యాసంస్థల కరస్పాండెంట్, కార్యదర్శి డాక్టర్ పాలెపు చిరంజీవినీకుమారి ఈనెల 1న మరణించారు. ఆమె సంస్మరణార్థం కాకినాడ-సామర్లకోట రోడ్డులోని ఐడియల్ కళాశాల ప్రాంగణంలో గురువారం సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్టు పూర్వ విద్యార్థి దామెర మురళీ తెలిపారు. ఈ సభలో ఆమె అభిమానులు, సాహిత్య ప్రజాసంఘాలువారు, పురప్రముఖులు, రాజకీయ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొని నివాళులర్పించాలని కోరారు.

అంతర్వేదిలో వైభవంగా మహా జ్యేష్ఠాభిషేకం


మహా జ్యేష్ఠాభిషేకానికి జలాలను తీసుకెళ్తున్న అర్చకులు, అధికారులు

అంతర్వేది, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలోని అంతర్వేది పుణ్యక్షేత్రం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జ్యేష్ఠా నక్షత్ర మహాపర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి మూలవరులకు సప్తనదీ జలాలతో మహా జ్యేష్ఠాభిషేకం, మహాశాంతి హోమం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య, అర్చక, వేద పండితులు, పండితోత్తములతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, చతుర్దశ కలశారాధన, నవకలశారాధన, పంచామృత కలశారాధన, సప్తనదీ కలశ ఆవాహనాలు, ఆరాధనలు, విశేష అర్చనలు, అగ్ని మధనము, అగ్ని హోత్రములు చేపట్టారు. అర్చకులు, అధికారులు కలశములతో సప్త నదీ జలాలను తీసుకుని ఆలయ ప్రదక్షిణ చేసి అగ్ని ప్రతిష్ఠాపన అనంతరం నదీ జలాలు, చతుర్దశ కలశాలు, పంచామృత కలశలతోను స్వామివారి మూలవరులకు మహాజ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పూర్ణాహుతిలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాలరాజా బహదూర్, రాష్ట్రమార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు, రాజోలు నీటిసంఘం చైర్మన్ పినిశెట్టి వెంకటస్వామి, వైస్ చైర్మన్ ఆకన బాబ్జినాయుడు, దిరిశాల బాలాజీ పాల్గొన్నారు.

తైక్వాండో చాంపియన్‌గా ఉమ్మడి జిల్లా

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 11(ఆంధ్ర జ్యోతి): అనంతరం జిల్లా తాడిపత్రిలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో చాంపియన్‌గా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నిలిచింది. సబ్ జూనియర్, జూ నియర్, సీనియర్ విభాగాల నుంచి 80 మంది విద్యార్థులు పాల్గొనగా 38 గోల్డు, 12 సిల్వర్, 17 బ్రాంజ్ మొత్తం 67 మెడల్స్ సాధించి 43 వ రాష్ట్రస్థాయి పోటీల్లో ఓవరల్ చాంపియన్‌గా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నిలిచింది. రెండో స్థానంలో కడప, మూడోస్థానంలో అనంతరం జిల్లాలు నిలిచాయని జిల్లా సెక్రెటరీ బి.అర్జున్‌రావు తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను డీఎస్డీవో శ్రీనివాస్ కుమార్, జిల్లా ఒలింపిక్ సెక్రెటరీ, ప్రెసిడెంట్లు అభినందించారు. కార్యక్రమంలో నేషనల్ రిఫరల్ ఎస్.సాయి, రోహిత్ జోషి, మణికంఠ, పిభార్గవి అభిషేక్ పాల్గొన్నారు.


మెడల్స్ సాధించిన తైక్వాండో క్రీడాకారులు

వ్యక్తి అనుమానాస్పద మృతి

తుని రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన కలకలం రేపింది. 16వ నంబరు జాతీయ రహదారిని అనుకుని కొండవారిపేట సమీపంలో చర్చి ఎదురుగా ఉన్న పొదల్లో వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. మృతి చెందిన వ్యక్తి పిఠాపురం రూరల్ కోలంక గ్రామానికి చెందిన నంద్యాల వీరభద్రరావు (35)గా తుని సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. అతడు ఈనెల కనిపించకుండాపోవడంతో పిఠాపురం పోలీస్ స్టేషన్లో కేసు నమోదైనట్టు ఆయన చెప్పారు.

రాజమహేంద్రవరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

» గోదావరి పుష్కర ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి



గోదావరి పుష్కర ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము, శాప్‌చైర్మన్ నాయుడు, కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరంసిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 2వ డివిజన్ వెంకట్రామయ్యనగర్‌లో మునిసిపల్ సాధారణ నిధులు రూ.కోటి91లక్షలు, శాప్‌నిధులు రూ.కోటి 50లక్షలు కలిపి మొత్తం రూ.3కోట్ల41లక్షల నిధులతో నిర్మించిన గోదావరి పుష్కర ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, శాప్‌చైర్మన్ అనిమిని రవినాయుడు, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కమిషనర్ కేతన్‌గార్గ్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా గోదావరి పుష్కర ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో విభాగాలను ఆదిరెడ్డి వాసు, శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజులు ప్రారంభించారు. అనంతరం కాంప్లెక్స్‌లో టేబుల్ టెన్నిస్, బిలియర్డ్స్, రైఫిల్ షూటింగ్, క్యారమ్స్, చెస్‌లను కొద్దిసేపు ఆడి ఉత్తేజపరిచారు. అనంతరం ఆదిరెడ్డి వాసు మా ట్లాడుతూ రాజమహేంద్రవరం చరిత్రలో గోదావరి పుష్కరాలు ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఒక మైలు రాయిగా నిలిచిపోతుందన్నారు. కాంప్లెక్స్‌లో కేరమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్, షూటింగ్, స్నూకర్ బిలియర్డ్స్‌తోపాటు జిమ్ కూడా ఉంద న్నారు. ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ద్వారా నగరపాలక సంస్థకు ఏటా రూ.10లక్షల ఆదాయం సమకూరనుందని తెలిపారు. ఖేల్ ఇండియా ద్వారా వీఎల్ పురం లారీ స్టాండ్ వద్ద రూ.50 కోట్లతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ సోమువీర్రాజు మా ట్లాడు తూ క్రీడా సంస్కృతిని పెంపొందించడానికి కేం ద్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు పేరుతో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి తర్వాత రాజమహేంద్రవరంలోనే రైఫిల్ షూటింగ్ ఉన్నట్లు చెప్పారు. మరోవైపు క్రీడలపట్ల మక్కువతో ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడా రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు రవినాయుడు తెలిపారు. ఇప్పటివరకు ఉద్యోగాల్లో ఉన్న క్రీడా కోటా రిజర్వేషన్‌ను 2శాతం నుంచి 3శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన వారికి రూ.7కోట్ల నగదు ప్రోత్సాహంతోపాటు గ్రూ ప్-1 ఉద్యోగం అవకాశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. తాజా డీఎస్సీ నోటిఫికేషన్ కింద క్రీడా కోటాలో 421 పోస్టులను కేటాయించినట్లు తెలిపారు. రానున్నరోజుల్లో రాజమహేంద్రవరంలో వాటర్స్ గేమ్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అనంతరం కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. నగరంలో యువతలోదాడివున్న క్రీడానైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ ఇండోర్ స్పోర్ట్స్‌కాంప్లెక్స్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వైశ్రీనివాస్, వర్రే శ్రీనివాసరావు, మజ్జి రాంబాబు, ఉప్పులూరి జానకి రామ య్య, నక్కా దేవి వరప్రసాద్, బుడ్డిగ రాదా, కోసూరి చండీప్రియ, తురకల నిర్మల, కప్పల వెలుగు కుమారి, కురగంటి సతీష్ పాల్గొన్నారు.


డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్జీవో నాయకులు

ఆఫీస్ బేరర్స్‌కు రాయితీ ఇవ్వాలి

జీజీహెచ్(కాకినాడ)జూన్ 11(ఆంధ్రజ్యో తి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మెడికల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఏపీ ఎన్జీవో సంఘంలో ఆఫీస్ బేరర్స్‌గా పని చేస్తున్న ఉద్యోగులను వారు ఆఫీస్ బేరర్స్ గా ఎన్నికైన నాటి నుంచి 9 సంవత్సరాల వర కు అదే స్టేషన్‌లో పనిచేసేందుకు మినహాయింపు ఇవ్వాలని ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు బుధవారం డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహ నాయక్‌ను కలిసి వినతి పత్రాన్ని అంద జేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన క్లారిఫికేషన్‌ను డీఎంహెచ్‌వోకు వివరించి బదిలీలు పారదర్శకంగా చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీ ఎన్జీవో సంఘ అధ్యక్షుడు జి.రామ్‌మోహన్ రావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, సరెళ్ళ చంద్రరావు, రామకృష్ణ, చార్లెస్ పాల్, అరదాడి సత్తిరాజు పాల్గొన్నారు.

కేశవదాసుపాలెంలో గ్యాస్ లీకేజీ

అంతర్వేది, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం బెల్లకొండవారి మెరక సమీపంలో బుధవారం రాత్రి స్వల్పంగా గ్యాస్ లీకేజీ అయింది. కొత్తగా వేసిన పైపులైను నుంచి గ్యాస్ లీకవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అడుగు భాగాన ఉన్న గ్యాస్ పైపులైను నుంచి గ్యాస్ లీకవడంతో ఆ ప్రదేశంలో ఉన్న నీటిలో నుంచి బుడగలు రావడంతో ఓఎన్జీసీ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. తరచూ అక్కడ గ్యాస్ లీకవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇళ్ల మధ్యలో నుంచి పైపులైను వెళ్లి తరచూ గ్యాస్ లీకేజీలు జరుగుతుండడంతో భయభ్రాంతులకు గురవుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై ఓఎన్జీసీ అధికారులు చర్యలు తీసుకుని గ్యాస్ లీకేజీని శాశ్వతంగా అరికట్టాలని గ్రామస్తులు కోరారు.


కేశవదాసుపాలెం గ్రామంలో ఓఎన్జీసీ పైపులైను నుంచి లీకవుతున్న గ్యాస్

ఉచిత నిర్బంధ విద్య పిల్లల హక్కు

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ

రాజమహేంద్రవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి):ఉచిత నిర్బందవిద్య పొందడం పిల్లల హక్కు అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్‌జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. 'నల్సా-బాలబాలికలకు స్నేహపూర్వక న్యాయ సేవల పథకం-2024', 'మానసిక అనారోగ్యం, మేధో వైకల్య వ్యక్తులకు చట్టపరమైన సేవల పథకం-2024'పై బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత నిర్బంధ విద్య పొందడం 6 నుంచి 14ఏళ్లలోపు పిల్లలకు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. వివిధ కారణాలవల్ల బడికి దూరమైన వారిని గుర్తించి మళ్లీ చదువుకునే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దివ్యాంగులకు ఉన్న సేవలను సమర్ధ వంతంగా అందించాలన్నారు. డీఎల్ఎస్ఏ ద్వారా అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవల గురించి పిల్లలకు వివరించారు. అనంత రం ప్రజలకు అందించాల్సిన చట్టపరమైన హక్కుల విషయమై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందా ల్సిందేనని స్పష్టం చేశారు. ఈవిషయంలో ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఆమె సూచించారు. ప్రభుత్వాస్పత్రి డాక్టరు హరిచంద్ర, జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ లీగల్ అధికారి గౌరి, డీటీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆరు నెలల్లోనే నిర్మాణాలను పూర్తిచేస్తాం

● శాప్ చైర్మన్ రవినాయుడు

దివాన్‌చెరువు, జూన్11 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఖేలో ఇండియానిధులతో నిర్మిస్తున్న నిర్మాణాలను ఆరునెలల్లో పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఖేలో ఇండియా నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా అధికార్లు, కాంట్రాక్టరు, విశ్వవిద్యాలయ ఇంజనీర్ గత పాలకులు అనాలోచిత నిర్ణయాలవల్ల పనులలో జాప్యం జరిగిందన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామని అన్నారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తయ్యేందుకు రూ.6.10కోట్లు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి రూ3.16 కోట్లు అవసరం అవుతుందన్నారు. నన్నయ వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ శాప్ సహకారంతో ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలను పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయం, శాప్ అధికార్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


నిర్మాణ పనులు పరిశీలిస్తున్నశాప్ చైర్మన్ రవినాయుడు

జీజీయు, కేపీఎంజీ, మెక్వైరీ వర్శిటీల మధ్య ఎంవోయూ

రాజానగరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయు) ఆస్ట్రేలియాలోని ప్రఖ్యాత మెక్వైరీ యూనివర్శిటీ, ప్రముఖ సంస్థ కేపీఎంజీ ఇండియాతో అవగాహన ఒప్పందాలు(ఎంవోయు)చేసుకుంది. ఈసందర్భంగా జీజీయు ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణ రాజు(చైతన్యరాజు)జీజీయు క్యాంపస్‌లో నిర్వహి ంచిన ప్రత్యేక సమావేశంలో ఇందుకు సంబ oధించిన ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఈకార్యక్రమంలో జీజీయు ప్రో ఛాన్సలర్ కె.శశికిరణ్ వర్మ మాట్లాడుతూ కేపీఎంజీ, మెక్వైరీ యూనివర్శిటీలతో ఎంవోయు జరగడం జీజీయు చరిత్రలో ఒక మైలురాయి గా నిలిచిపోతుందన్నారు. ముఖ్యంగా బీటెక్ కోర్సులో సైబర్ సెక్యూరిటీ స్పెషలైజేషన్ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. దీంతో విద్యార్థులకు అంతర్జాతీయస్థాయిలో అవకాశాలు లభిస్తాయన్నారు. జీజీయు ఛాన్సలర్ చైతన్య రాజు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలతో బోధన అందించేందుకు జీజీయూ ఎల్లప్పుడూ ముందుండే సంస్థ అని అన్నారు. కే జీఎంజీ ఇండియా ఎడ్యుకేషన్ అండ్ స్కిల్ డవలప్‌మెంట్, గవర్నమెంట్ అండ్ పబ్లిక్ సర్వీసెస్ నేషనల్ లీడర్ నారాయణన్ రామస్వామి మా ట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో జీజీ యూ వంటి విశ్వవిద్యాలయాలతో కలిసి పనిచేయడం ద్వారా విద్యా ర్థులకు ప్రతిభను ప్రదర్శించే అవకాశాలు కలుగుతాయన్నారు. అతిథులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మెక్వైరీ యూనివర్శిటీ సైబల్ స్కిల్స్ అకాడమీ సీఈవో మేట్‌బుష్బీ ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. కేపీఎంజీ ఇండియా నుంచి మహావీర్ అగర్వాల్, రాఘవన్ ఎస్, జీజీయూసాంకేతిక సలహాదారు సుమంత్, వైస్ చాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రోవైస్ చాన్సలర్ కేవీటీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు, డీన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అమలాపురం టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అమలాపురం నుంచి ముమ్మిడివరం గేట్ సెంటర్‌కు వెళ్లే రోడ్డులో బుధవారం గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మలికిపురానికి చెందిన కొల్లు కుమారస్వామి(30) గాయపడ్డాడు. అతడికప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ కిశోర్‌బాబు తెలిపారు.

గోశాలకు 500కిలోల దాణా వితరణ

అంతర్వేది, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని గోశాలకు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన కుమార్ రైస్ ఇండస్ట్రీస్ అధినేత దేవరపు ఆనంద్‌బాబు, కుటుంబ సభ్యులు రూ.12,500 విలువైన 20 బస్తాల(500కిలోలు) దాణాను ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించారు.

విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి : కలెక్టర్



పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

ముమ్మిడివరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థినులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ముమ్మిడివరం మండలం రాణేలంకలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి, మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఇటీవల కలెక్టర్ పర్యటనలో భాగంగా గురుకుల పాఠశాలను సందర్శించిన సమయంలో పలు పనులు చేపట్టాలని ఆయన పంచాయతీరాజ్ ఇంజనీర్లను ఆదేశించారు. ఈమేరకు చేపట్టిన పనుల తీరును క్షేత్రస్థాయిలో ఆయన నిశితంగా పరిశీలించారు. కొత్తగా ఏర్పాటుచేసిన రెండు మోటార్లు, మూడు ఇన్వర్టర్లు, 15 సీసీ కెమెరాలను పరిశీలించారు. గురుకుల పాఠశాలలో విద్యాభ్యాసం చేసే బాలికలకు అన్ని వసతులు ఉండేలా ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. పాఠశాల సమస్యలపై ఆరా తీయగా పాఠశాల క్రీడా ప్రాంగణం ఎత్తు చేయాలని ప్రిన్సిపాల్ టి.గంగాభవానీ కలెక్టర్‌ను కోరారు. క్రీడా స్థలం ఎత్తుచేసే పనులను ఇంజనీర్ ద్వారా చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. పంచాయతీరాజ్ ఏఈ రాంజీ, తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ



రవాణాధికారి రాఘవ్‌కుమార్ నుంచి ఉత్తమ ఉద్యోగ అవార్డు అందుకుంటున్న డిపో మేనేజర్ మూర్తి

అమలాపురం రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీడిపో గ్యారేజీ ఆవరణలో బుధవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్టీపీ రాఘవకుమార్ హాజరయ్యారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇంధన సామర్థ్య విభాగంలో టార్గెట్ సాధించిన డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ ఇంజనీర్, మెకానికల్ గంగుమళ్ల రమాలక్ష్మీదేవి, సూపరింటెండెంట్ నరసింహారావు, టెక్నీషియన్లు గౌరీనాథ్, శివన్నారాయణ తదితరులకు ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలు అందజేశారు. ఇంధన సామర్థ్యంలో అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు పి.రాంబాబు జె.చంటి, కె.శ్రీనివాసరావు, ఎస్టీఐ కె.రమేష్‌బాబు, అత్యధికరూట్ ఆదాయం సాధించిన కండక్టర్లు కేడీవీఎస్ రాజు, ఎంవీడీ ప్రసాద్, వీఎస్ రావులకు ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలు అందజేశారు. వీరితోపాటు ఆన్‌కాల్ విధానంలో పనిచేస్తూ ఇంధన సామర్థ్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు డ్రైవర్లకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. డిపో అభివృద్ధికి కృషి చేస్తున్న సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ ప్రతిమాకుమారి,అసిస్టెంట్ ఇంజనీర్ దేవి, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎన్.వరహాలబాబు, ట్రాఫిక్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.27.49కోట్లతో రహదారుల నిర్మాణం: ఎమ్మెల్యే



వానపల్లిపాలెంలో సీసీ రహదారి ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఉప్పలగుప్తం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో అమలాపురం నియోజకవర్గంలో రూ.27.49కోట్లతో రహదారుల నిర్మాణం జరిగినట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. వానపల్లిపాలెంలో బుధవారం ఆయన రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. రూ.20లక్షలతో నిర్మించే సీసీ రహదారికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ నల్లా బాబండి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఏడాది పాలనలో నియోజకవర్గంలో 237సీసీ రహదారులు, 15బీటీ రహదారులు, 10ఆర్ అండ్‌బీ రహదారులు నిర్మించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, కూటమి నాయకులు నల్లా రాజాసత్యనారాయణ, దున్నాల ఆదిబాబు, నల్లా నాగబాబు, నల్లా నరసింహారావు, నల్లా చిన్ని, కొల్లి శ్రీనుబాబు, దోనిపాటి చినరెడ్డి, వల్లూరి తాతయ్య, బొంతు రామమోహనరావు, నల్లా శ్రీనివాసరావు, చీకట్ల ఏసు, రవణం మధు, నల్లా ప్రభాకరరావు, లంకే భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలి

రాజోలు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా పిలుపునిచ్చారు. రాజోలులో గోదావరి గట్టుపై బుధవారం ఆయన మొక్కలు నాటారు. బీజేపీ రాజోలు నియోజకవర్గ కోకన్వీనర్ జొన్నలగడ్డ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటామన్నారు.

రైతుల సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వం

- ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు
- ఘనంగా ఏరువాక పౌర్ణమి పూజలు



ఉప్పలగుప్తం: శింగరాయపాలెంలో నాగలితో పొలాన్ని దున్నుతున్న ఎమ్మెల్యే ఆనందరావు



అంబాజీపేటలో ఏరువాక పౌర్ణమి పూజల్లో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ

ఉప్పలగుప్తం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతు సంక్షేమానికి పలు ప్రణాళికలు రూపకల్పన చేస్తున్నట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఏరువాక పూర్ణిమ సందర్భంగా బుధవారం సింగరాయపాలెంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నాగలికి పూజలు చేశారు. పొలం దున్ని విత్తనాలు చల్లారు. వ్యవసాయాధికారి గుత్తుల కుమార్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, డీసీఎంస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, ఎంపీటీసీ నాగులపల్లి శేషవేణి, నీటిసంఘం చైర్మన్ నల్లా సత్యనారాయణ, కూటమి నాయకులు గుత్తుల నాగేశ్వరరావు, బొర్రా ఈశ్వరరావు, అరిగెల నరేష్, గొలకోటి తాతాజీ, చీకట్ల నాని, మంచెం బాబి, శీలం భాస్కరరావు, ఆకేటి సత్తిబాబు, పి.తిరుమలరావుపాల్గొన్నారు.

ఏరువాక సాగారో అన్నో..

అమలాపురం రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఏరువాక సాగారో అన్నో చిన్నన్న.. అంటూ ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని తొలకరి పంటను రైతులు అధికారుల సమక్షంలో దుక్కిదున్ని ప్రారంభించారు. రెడ్డిపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులు తొలుత నాగలికి, ఎద్దులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రైతులకు భూసార పరీక్షలకు సంబంధించిన పత్రాలను వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఎంఏ షంషీ అందజేశారు. మండల వ్యవసాయాధికారి కడలి ధర్మప్రసాద్, డి.మాధవి, సర్పంచ్ కరాటం రత్నప్రసన్న-ప్రవీణ్, మాజీ సర్పంచ్ కరాటం సూర్యభాస్కరరావు, నీటి సంఘం డైరెక్టర్ కొలిశెట్టి జయప్రకాష్, వెంకటలక్ష్మి, ప్రేమ్‌కుమార్, అప్పారి వెంకటరమణ, గుర్రం ధర్మరాజు, రేలంగి జ్యోతి, షేక్ అమీర్, నల్లా సతీష్ పాల్గొన్నారు.

నాగలి పట్టి దుక్కిదున్నిన ఎమ్మెల్యే

ఐ.పోలవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమం పాతయింజరంలో బుధవారం జరిగింది. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. తొలుత నాగలికి పూజచేసి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. నాగలితో ఎమ్మెల్యే దుక్కి దున్నారు. రైతులకు వరి విత్తనాలు, భూసార పరీక్ష పత్రాలు అందించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, టేకుమూడి లక్ష్మణరావు, చెల్లి అశోక్, సాయిరాజు, సూరిబాబురాజు, గొలకోటి దొరబాబు, మందాల గంగసూర్యనారాయణ, ముదునూరి వాసురాజు, ముత్యాల జయలక్ష్మి, కట్టా త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఏరువాక పౌర్ణమి వేడుకలు

రాజోలు, (ఆంధ్రజ్యోతి): తాటిపాక, కడలి యూనిట్ సభ్యులతో రైతులు వ్యవసాయశాఖ అధికారులు కలిసి ఏరువాక పౌర్ణమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు నాగళ్లకు, పశువులకు పూజలు చేశారు. ఈసందర్భంగా మండల వ్యవసాయాశాఖాధికారి మధుకుమార్ మాట్లాడుతూ రోహిణీ రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టే పౌర్ణమిని ఏరువాక పౌర్ణమిగా పిలుస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, పి.ప్రసన్నకుమార్, ఆర్ఎస్కే సిబ్బంది సుబ్బారాయుడు, శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటలు బాగా పండాలి

పి.గన్నవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఈఏడాది ప్రకృతి అనుకూలించి రెండు పంటలు అధిక దిగుబడులతో పంటలు పండాలని ఇన్‌చార్జ్ ఏడీఏ సిహెచ్‌డి విజయ్‌కుమార్ ఆకాంక్షించారు. రాజులపాలెంలో పిన్నింటి సూరిబాబు పొలంలో నిర్వహించిన ఏరువాకకార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. రైతులకు మొదటి పంటకు నారుమడులు సిద్ధం చేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనలతో వంగడాలను ఎంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు కోల్నాడ సత్యనారాయణ రాజు, మాజీ ఎంపీటీసీ నక్కా సత్యనారాయణ, ఏఈవోలు, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలి

అంతర్వేది, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మోరిపోడులో సుబ్బారాయుడుపేట వద్ద స్థానిక సర్పంచ్ ముప్పర్తి అలివేలుగంగా త్రివేణి కొబ్బరికాయ కొట్టి ఏరువాక పౌర్ణమి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని సర్పంచ్ ఆకాక్షించారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి పీఎండీఎస్ కిట్లను పంపిణీ చేశారు. అపరాల పంటలు, పెసలు, మినుముల పొలాలను సందర్శించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు ముప్పర్తి నాని, జడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీటీసీ బళ్ల సుభాషిణి-లక్ష్మణరావు, వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన దిగుబడులు

అంబాజీపేట, జూన్11(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించడం ద్వారా ఆరోగ్యవంతమైన పంటలతో పాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. మాచవరం పరిధిలోని పోతాయిలంకలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి ద్వారా వ్యవసాయ పనులు ప్రారంభించాలని సూచించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ జేడీ కె.వెంకటేశ్వరరావు, ఏడీ ఎల్.విజయరెడ్డి, ఏవో విజకుమార్, రైతులు మట్టపర్తి భాస్కరరావు, బాలాజీ, ఏఈ వోలు డి.దుర్గారావు, వీహెచ్‌ఏలు, వీఏఏలు పాల్గొన్నారు. కోనసీమ ఆహార నిధి అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ ఆధ్వర్యంలో ఇరుసుమండలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రైతు పూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి రైతులను సత్కరించారు.

పుష్కర ఘాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే దేవ

అంతర్వేది, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అంతర్వేది వశిష్ఠరేవులో ఉన్న పుష్కర ఘాట్‌ను కూటమి శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ బుధవారం పరిశీలించారు. 2027జూలై 23నుంచి గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పుష్కరఘాట్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పుష్కర ఘాట్ల వద్ద రోడ్డు, విద్యుత్ లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు(పెద్దకాపు), దిరిశాల బాలాజీ, ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఉపసర్పంచ్ ఏసు, బోనం రాజు, నీటిసంఘ ఉపాధ్యక్షుడు ఆకన బాబ్జీనాయుడు, ఉండపల్లి అంజిపాల్గొన్నారు.

జేఈ ఫలితాలు విడుదల

యానానికి చెందిన ఐదుగురికి ఉద్యోగాలు

యానాం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి విద్యుత్ శాఖలో 73జూనియర్ ఇంజనీర్ ఖాళీల భర్తీకి సంబంధించి ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. పుదుచ్చేరిలో ఆరు కేంద్రాల్లో జరిగిన పరీక్షలో పుదుచ్చేరి, కారైకాల్, మాహే, యానానికి చెందిన 1,415మంది హాజరయ్యారు. కేటగిరీల ఆధారంగా ఎంపికైన 73మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. యానానికి చెందిన ఐదుగురు ఎంపికయ్యారు. వీరిలో మెల్లం శరత్‌రాజ్, పంపన జ్యోతినారాయణ, కోల్లు శ్రీనివాసు, ఎం.సుభాస్ చంద్ర వ్యాస్, కోన వెంకట అనంతకిరణ్ ఉన్నారు. వీరిలో పలువురు పరిపాలనాధికారి మునిస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎమ్మెల్యే పరామర్శ

అంబాజీపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం బీచ్‌లో యాళ్ల హరికిషోర్ గల్లంతై మృతి చెందిన విషయం విదితమే. బాధిత కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరామర్శించారు. ఇరిగేషన్‌శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, అరిగెల సూరిబాబు, దొమ్మేటి సాయికృష్ణ, తాటికాయల శ్రీను, సత్యనారాయణపరామర్శించిన వారిలో ఉన్నారు. వక్కలంకలో మాతృవియోగంతో బాధపడుతున్న జనసేన పార్టీ అధ్యక్షుడు పితాని శ్రీనివాసరావును ఎమ్మెల్యే గిడ్డి పరామర్శించారు.

టీడీపీ పటిష్టానికి కృషి చేయాలి

మామిడికుదురు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ గ్రామ శాఖలు పార్టీ పటిష్టానికి కృషి చేయాలని రాజోలు నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు ఈలి శ్రీనివాస్ సూచించారు. మామిడికుదురు గ్రామశాఖ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక కంచివారిపాలెంలో జరిగిన ఎన్నికలో అధ్యక్షునిగా కంచి విశ్వనాథం, ప్రధాన కార్యదర్శిగా నామన రాధాకృష్ణ మనోహర్‌ను ఎన్నుకున్నారు.

పంటలపై దృష్టి సారించాలి

ఐ.పోలవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ రంగంతో పాటు పాడిపంటలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సూచించారు. బుధవారం మురమళ్ళలో మినీ గోకులం షెడ్డును ఆయన ప్రారంభించారు. పాడిపంటల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఎస్.మధుసూదన్, రైతులు జంపన బాబు, ఏలూరి సూర్యనారాయణమూర్తి, పెన్మెత్స శేఖర్, పంచాయతీ కార్యదర్శి పి.రవిరాజు పాల్గొన్నారు.

కథాకళి సినిమా షూటింగ్ ప్రారంభం



క్లాప్ కొట్టి సినిమా షూటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అయినవిల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): శానపల్లిలంకలో బుధవారం కథాకళి సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ హాజరై సినిమా షూటింగ్‌ను క్లాప్ కొట్టి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో సినిమాల షూటింగ్‌లు జరగడం హర్షదాయకమన్నారు. ప్రజలకు ఆర్థికంగా సాంస్కృతికంగా ఎంతో మేలు చేస్తుందన్నారు. స్థానిక కళాకారుల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం లభిస్తుందన్నారు. చిత్ర యూనిట్ సభ్యులు, గ్రామస్థులు హాజరయ్యారు. కథాకళి సినిమా విజయవంతం కావాలని ఎమ్మెల్యే గిడ్డితో పాటు పలువురు ఆకాంక్షించారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

అమలాపురం రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నడిపూడిలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు బుధవారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించే అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపనచేసి ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి-బాబ్జి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా, మాజీ అధ్యక్షుడుమల్లుల పోలయ్య, నాయకులు నల్లా స్వామి, దున్నాల దుర్గ, మంద గెద్దయ్య, బోనం సత్యవరప్రసాద్, నల్లా మల్లిబాబు, ఈతకోట నాగేశ్వరరావుతో పాటు గ్రామ సర్పంచ్ చెల్లుబోయిన నాని తదితరులు పాల్గొన్నారు.

దోమలతో మలేరియా వ్యాప్తి

మామిడికుదురు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): దోమల ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని లూటుకుర్రు పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ కె.ఉమామహేశ్వరరావు సూచించారు. బుధవారం మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా ఆదుర్రులో అందరిలో మార్పుతోనే మలేరియా అంతం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం వైకేడీ నాగలక్ష్మి, సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం ప్రారంభం

మలికిపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మోరిపోడులో నూతనంగా నిర్మించిన పంచాయతీ అదనపు కార్యాలయాన్ని సర్పంచ్ ముప్పర్తి అలివేలుగంగాత్రివేణి బుధవారం ప్రారంభించారు. ఉపాధి నిధులతో ఈభవనాన్ని నిర్మించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, మాజీ సర్పంచ్‌లు ముప్పర్తి త్రిమూర్తులు, చింతా వెంకటరమణి, ఎంపీడీవో కె.సూర్యనారాయణ, ఎంపీటీసీ బళ్ల సుభాషిణి, బళ్ల లక్ష్మణ్, బళ్ల రాము, వలవల బాబీ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తజనం

ఆత్రేయపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,19,322 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

రైతు బజార్ ప్రారంభోత్సవంలో మంత్రి సుభాష్


రైతుబజార్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం రామచంద్రపురంలో నిర్మించిన రైతు బజార్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను నేరుగా వారే అమ్ముకునేందుకు వీలుగా రైతుబజార్‌లను ప్రారంభిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో హృదయ సంబంధిత వ్యాధులతో బాధపడే వారికి తక్షణం వైద్యసేవలు అందేలా త్వరలో మూడు బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమం లో వాసంశెట్టి సత్యం, ఆర్డీవో దేవరకొండ అఖిల, డీఎస్‌వో ఉదయ భాస్కర్, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి కె.విశాలాక్షి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ డీఈఈ శ్రీకాంత్ తదితరులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు. రైతుబజార్‌ను ప్రారంభించిఅనంతరం మంత్రి కూరగాయలు కొనుగోలు చేశారు.


డ్రోన్‌తో పిచికారీని ప్రారంభిస్తున్న ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సునీల్ కుమార్

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

కె.గంగవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని గోదావరి ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం కెగంగవరంలోని టేకిడ్రైన్‌లో గుర్రపుడెక్క తొలగింపు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటిపల్లి డీసీ పరిధిలోని మురుగు డ్రైన్‌లలో గుర్రపుడెక్క తొలగింపునకు పనులు చేస్తున్నట్లు చెప్పారు. టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ మురుగు డ్రైన్‌లు పూడుకుపోవడం వల్ల వరదలతో పాటు, వర్షాకాలంలో రైతుల పంటలకు నష్టం కలుగుతుందన్నారు. మురుగుడ్రైన్‌లు బాగు చేయడం ద్వారా రైతుల పొలాలు ముంపు బారిన పడకుండా రక్షించబడతాయన్నారు. డ్రోన్ టెక్నాలజీతో తూటు తొలగింపు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో కోటిపల్లి డీసీ అధ్యక్షులు దాట్ల విజయగోపాల్‌రాజు, ఉపాధ్యక్షుడు తాడాల లోవరాజు తదితరులతో పాటు, కూటమి నాయకులు మరివాడ సూరిబాబు, సలాది రమేష్ పాల్గొన్నారు.



పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో విజయదుర్గా అమ్మవారు. పక్క చిత్రంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పీఠంలో వైభవంగా జ్యేష్ఠ పౌర్ణమి పూజలు

రాయవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో జ్యేష్ఠ పౌర్ణమి పూజలను బుధవారం వైభవంగా నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని విజయదుర్గా అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు జరిపి ప్రత్యేక అలంకరణ చేశారు. తొలుత విజయ వేంకటేశ్వరస్వామికి సుప్రభాతసేవ, తులసిదళ అర్చనలు చేశారు. అనంతరం విజయదుర్గా అమ్మవారికి లలితా అష్టోత్తర, సహస్రనామాలు, దుర్గాత్రిశతి, ద్వాత్రింశ నామావళి, లక్ష్మి, సరస్వతి, దుర్గా అష్టోత్తరాలతో కుంకుమ పూజలు, భవాని శంకర సమేత అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం జరిపారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్య వెంకట కామేశ్వరి, బి.రమ, పెదపాటి సత్య కనకదుర్గ, బుజ్జి, వీఆర్వో బాబి భక్తులు పాల్గొన్నారు.

పీఠంలో ఏపీ హైకోర్టు జడ్జి పూజలు: వెదురుపాక విజయదుర్గా పీఠంలో బుధవారం ఏపీ హైకోర్టు జడ్జి జె.సుమతి దంపతులు సందర్శించారు. విజయదుర్గా అమ్మవారికి వారు శ్రీచక్ర కుంకుమార్చనలు చేశారు. అనంతరం అమ్మవారికి అర్చనలు, హారతులు నిర్వహించి పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. అనంతరం జడ్జి దంపతులను సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు. హైకోర్టు జడ్జి వెంట అనపర్తి జేఎఫ్‌సీఎం ఎం.వంశీకృష్ణ, మండపేట సీఐ దొరరాజు, రాయవరం ఎస్‌ఐ డి.సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.

భారీ వర్షం..లోతట్టు ప్రాంతాలు జలమయం

ఆత్రేయపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం మధ్యాహ్నం సుమారు 2 గంటలపాటు వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆత్రేయపురం బండారు కాలనీ జలమయమైంది. వాడపల్లిలో అవుట్‌లేట్ లేకపోవడంతో వర్షం నీరు రోడ్డుమీద ఉండిపోయి చెరువును తలపించింది. దుర్గమ్మ గుడి వద్ద వర్షం నీరు పొంగి ప్రవహించడంతో ఆ ప్రాంతం జలమయమైంది. పార్కింగ్ ప్రదేశం బురదమయమైంది.

నేడు విజయోత్సవ ర్యాలీ

రావులపాలెం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గురువారం రావులపాలెం కళా వెంకట్రావు విగ్రహం ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్ వద్ద నుంచి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్, కూటమి నేతల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు వారు తెలిపారు.

దివ్యాంగ పింఛన్లు తొలగిస్తే ఉద్యమం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లు తనిఖీ పేరుతో తొలగిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం రామచంద్రపురం చెలికాని రామారావు స్మారక భవనంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల దివ్యాంగుల ఆత్మగౌరవ సదస్సు జరిగింది. ఈ సదస్సులో నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఓహెచ్ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ సూరంపూడి మాణిక్యాలరావు, హక్కుల వేదిక జాతీయ కార్యదర్శి ముత్యాల పోసికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు

మండపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి) అంగన్‌వాడి కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎన్.వీ‌రెడ్డి అన్నారు. అర్తమూరులో వున్న అంగన్‌వాడి కేంద్రంలో బుధవారం కిషోరబాలిక విశాసం కార్యక్రమం ముగింపు లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ప్రయాణికుల సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ

రావులపాలెం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు డిపో మేనేజర్ జీజీవీ రమణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో 14 నుంచి కాంప్లెక్స్‌లో బస్సుపాస్‌ల కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.


ర్యాలి గోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

స్వామివారికి ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి క్షేత్రపాలకుడు గోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా విశేష అర్చన, తులసీ పూజ, అమ్మవార్లకు కుంకుమార్చన, పూర్ణాహుతి, స్వామివారి చక్రస్నానం జరిపారు. అనంతరం సాయంత్రం నిత్యోపాసన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. నిత్యఅన్నదాన ట్రస్టుకు దాతలు విరాళాలు అందచేశారు.

నేడు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల శ్రీకారం

రాయవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ అభివృద్ధి పనులకు నేడు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభిస్తారని హెచ్ఎం వి.శాంతి సునీత తెలిపారు. కిచెన్ గార్డెన్, ఇంకుడు గుంత, వాకింగ్ ర్యాంప్, డిజిటల్ లైబ్రరీ, ప్లేగ్రౌండ్ తదితర అభివృద్ధి పనులు ప్రారంభిస్తారన్నారు. అనంతరం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు, పుస్తకాల పంపిణీలో ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు.

వైభవంగా జనార్దనస్వామి చక్రస్నానం

కపిలేశ్వరపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురంలోనున్న జనార్దనస్వామి చక్రస్నానం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని పల్లకీలో స్థానిక గౌతమి గోదావరి నది వద్దకు తీసుకెళ్ళి అక్కడ వేద పండితులు పూజలు నిర్వహించారు. అనంతరం నదిలో స్వామివారి చక్రస్నానం జరిపారు. కార్యక్రమం గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మెగాజాబ్ మేళా

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో ఈనెల 13న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి డి.హరిశేషు తెలిపారు. మండపేట, రామచంద్రపురం ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ చదివిన యువతీ, యువకులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రఘువర్మ 99484 04165, ప్లేస్‌మెంట్ అధికారి రాజేంద్ర ప్రసాద్ 97044 14258 ఫోన్‌లో సంప్రదించాలని తెలిపారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

ఆలమూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బాల కార్మికులను గుర్తించి బడిలో చేర్పించేందుకు సహకరించాలని కోరుతూ మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాల చేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీ నిర్వహించారు. బాలకార్మికులను పనిలో పెట్టుకోవడం నేరమని దీన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నగమల్లేశ్వరరావు, న్యాయవాదులు ధనరాజు, జొన్నపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైఫాన్ నిర్మాణ పనుల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆత్రేయపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నత్తనడకన సైఫాన్ నిర్మాణ పనులు శీర్షికన ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. బుధవారం డ్రైనేజీ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎంవీఎస్ కిషోర్ వాటి పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నాణ్యత ప్రమాణాలతో వాటి పనులు వేగవంతంగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రూ.2.34 కోట్లతో చేపడుతున్న ఈ పనులు వర్షాల వల్ల ఆలస్యమైందని ఈఈ తెలిపారు. ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణతో పాటు క్వాలిటీ కంట్రోల్ అధికారుల పర్యవేక్షణలో సైఫాన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రైతుల వద్ద నుంచి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. సర్వే నిర్వహించి పంట బోదె, మురుగుబోదెలను వేర్వేరుగా ఏర్పాటు చేస్తామన్నారు. శనివారం నాటికి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. బ్యాంకు కెనాల్‌కు సాగునీటి విడుదల చేసేలా పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ ఆర్.నాగార్జునరావు, జేఈ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మండపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం 13న జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ టీ.వీ.రంగారావు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతీవాడ నూక దుర్గారాణి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులు అంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన తెలిపారు.



రాయవరంలో ఏరువాక పౌర్ణమి నిర్వహిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు. పక్క చిత్రంలో రామచంద్రపురం మండలం యనమదలలో ఏరువాక పౌర్ణమి నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, రైతులు

ఏరువాక పనులు ప్రారంభం


కోటిపల్లి శివాలయంలో అభిషేకాలు చేస్తున్న అర్చకస్వాములు

రాయవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామంలో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏరువాక పౌర్ణమి నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ మాట్లాడారు. మంచి వర్షాలు కురిసి రైతులకు అధిక లాభాలు రావాలని ఏవో ఆకాంక్షించారు. అనంతరం శాస్త్రవేత్త కె.రాజశేఖరరావు మాట్లాడుతూ దేశానికి రైతులే వెన్నుముక అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు, శాస్త్రవేత్తలకు ముఖాముఖిగా ప్రతి మండలంలో వికసిత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనంతరం ఏడీఏ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఎరువుల యాజమాన్య పద్ధతులు, మోతాదుకు మించి యూరియా ఉపయోగించరాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, జనసేన నాయకుడు దేవిశెట్టి చిన్ని, టీడీపీ నాయకుడు గంగరాజు, జిల్లా వనరుల కేంద్రం ఏవో మనోహర్, వ్యవసాయశాఖ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

కోటిపల్లి శివాలయంలో ఏరువాక పూజలు

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి ఛాయాసోమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఏరువాక పౌర్ణమి పూజలు చేశారు. ఆలయ అర్చకులు గోదావరి నుంచి జలాలు తీసుకువచ్చి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సకాలంలో వర్షాలు పడాలని పూజలు చేసినట్టు ఆలయ ఈవో భీమశంకరం చెప్పారు.

యనమదలలో ఏరువాక

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం యనమదల గ్రామంలో బుధవారం ఏరువాక పౌర్ణమి నిర్వహించారు. గోపూజ, నాగలి పూజతో పాటు ట్రాక్టరుకు పూజ జరిపి పొలం దున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎన్.సత్యప్రసాద్, మాజీ ఎంపీటీసీ వి.వెంకటరమణ, మాజీ పీఏసీ సీఎస్ అధ్యక్షుడు గుణ్ణం కృష్ణమూర్తి, రైతులు, కూటమి నాయకులు గుణ్ణం పట్టాభిరామారావు, చింతపల్లి సత్తిబాబు, యడ్లపల్లి వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు


టేకిలో గ్రామీణ పశువైద్యశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని టేకి గ్రామంలో నిర్మించిన గ్రామీణ పశువైద్యశాల నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామ సర్పంచ్ కె.నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని ప్రభుత్వం అంచెలంచెలుగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. కాగా ప్రారంభోత్సవానికి ముందే పశువైద్యశాల నూతన భవనం పలుచోట్ల బీటలు వారడం గమనార్హం. దీనిపై పలువురు రైతులు, గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఆలమూరు ఏడీ అనిత, డీఈ టి.వెంకటేశ్వరరావు, మండల పశువైద్యాధికారి వీవీ రమణమూర్తి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీనివాస్, టీడీపీ సీనియర్ నాయకులు పుత్సల శ్రీనివాస్, గుడాల జయబాబు తదితరులతో పాటు వీఆర్వో నాగమణి, గ్రామస్తులు, పశువైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికులతో పనిచేయిస్తే కఠిన చర్యలు

మండపేట, జూన్, 11(ఆంధ్రజ్యోతి): బాల కార్మికులతో పని చేయిస్తే యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ అధికారి కాశి శివనాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం ప్రత్యేక అధికారుల బృందం మండపేట, ఆలమూరు మండలాల్లో పర్యటించింది. ఇటుకబట్టీలు, వ్యాపార సంస్థల్లో కార్మిక, విద్య, పోలీసుశాఖల అధికారుల బృందం సభ్యులు పర్యటించి తనిఖీలు జరిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే రూ.50వేల జరిమానాతోపాటు జైలుశిక్ష తప్పదని నిర్వాహకులను హెచ్చరించారు. కార్యక్రమంలో మండపేట రూరల్ ఏఎస్ఐ వేంకటేశ్వరరావు, విద్యాశాఖ సీఆర్‌పీ శేషగిరిరావు, జిల్లా ఎస్‌జీవో కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బి.సావరంలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండారు

విజయకనకదుర్గమ్మకు ఎమ్మెల్యే బండారు పూజలు

కొత్తపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం బొరుసువారి సావరంలోనున్న విజయకనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి నిర్వాహకుడు బొరుసు వెంకట ఉదయభాస్కర్, కొత్తపేట ఉపసర్పంచ్ విశ్వ మారుతీప్రసాద్, బొరుసు వీరన్న, బొరుసు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ద్వారపూడి-మండపేట మధ్య ట్రాఫిక్ మళ్లింపు

మండపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండపేట జడ్.మేడపాడు మధ్య వున్న రోడ్డు మధ్యలో కాల్వలకు వున్న కల్వర్టులు శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో మరమ్మతుల నేపథ్యంలో మూడు రోజులపాటు ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామని మండపేట రూరల్ ఎస్.ఐ బుజ్జిబాబు తెలిపారు. తాపేశ్వరం ఇప్పనపాడు మధ్య వంతెనల శిథిలం కావటంతో వాటిస్థానంలో తాత్కాలికంగా తూరలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజులపాటు మండపేట నుంచి రాజమహేంద్రవరం, సామర్లకోట వెళ్లే బస్సులను రామచంద్రపురం, రాజమహేంద్రవరం వయా ఏడిద, దుళ్ల కడియం మీదుగా రాజమహేంద్రవరం, రావులపాలెం, సామర్లకోట వెళ్లే వాహనాలు వయా మాచవరం మీదుగా కొనసాగుతాయని ఆయన తెలిపారు.

పోస్టల్ ఉద్యోగులకు అవార్డులు...హర్షం

మండపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండపేట పోస్టాఫీస్‌సులో పనిచేస్తున్న ఉద్యోగులు ఆయా సేవలను ప్రజలకు చేరవేయటంలో తమ వంతు కృషి చేస్తున్నారు. మెయిన్ పోస్టాఫీస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు పోస్టల్‌శాఖ సేవింగ్ ఖాతాలు తెరిపించటంతోపాటు అనేక పథకాలను అమలు చేయటంలో ఇద్దరు ఉద్యోగులు ముందు వరుసలో వున్నారు. ఇందులో భాగంగా కొండపల్లి సూర్యనారాయణ, కె.వి.నారాయణరావు సేవల విషయంలో గుర్తింపు పొందారు. వారిద్దరు ఉత్తమ ఉద్యోగులు అవార్డు పొందారు. వారికి అవార్డులు రావటంపై సహచర ఉద్యోగులు వారిని అభినందించి హర్షం వక్తం చేశారు,

నేడు కూటమి ఆధ్వర్యంలో విజయోత్సవ సభ

మండపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి గురువారం నాటికి ఏడాది పూర్తయిన సందర్భంగా విజయోత్సవ సభ, ర్యాలీ నిర్వహిస్తున్నామని టీడీపీ నేతలు తెలిపారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సారథ్యంలో జరిగే కార్యక్రమంలో కూటమి నేతలంతా పాల్గొని విజయవంతం చేయాలని నేతలు కోరారు. టీడీపీ పట్టణ కార్యాలయం నుంచి ఉదయం 10 గంటలకు ఆయా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.